ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

శుక్రవారం 19 జూన్ 2026 | సంపుటి: 1 సంచిక: 2 పేజీలు 12 వెల: 4

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

## హర్మూజ్‌లో కదులుతున్న నౌకలు!

ఇరాన్–అమెరికా మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పేర్కొనే హర్మూజ్‌కు మళ్లీ ఊపిరి పోసినట్లయ్యింది. ఆంక్షల నేపథ్యంలో కొంతకాలంగా అక్కడ వందలాది నౌకలు చిక్కుకుపోగా.. తాజాగా పరిసితులు కుదుటపడడంతో తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ఆయా నౌకలు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

న్యూఢిల్లీ, జూన్ 18 (సింగిడి)



2



## హిమాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

లోయలో పడిన బొలెరో.. ఏడుగురి దుర్మరణం

2

### రాయదుర్గం భూముల వేలంపై

## హైకోర్టు స్టే

అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్

కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు



2

హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది.

- హైదరాబాద్, జూన్ 18 (సింగిడి)

## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

### నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్

కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు

ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ

**న్యూఢిల్లీ, జూన్ 18 (సింగిడి)**

మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా ...మిగతా 2లో





## 30న రైతు భరోసా నిధులు విడుదల

### వానాకాలం సాగుకు రైతులకు ప్రభుత్వం అండ

- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 18 (సింగిడి):** ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ...మిగతా 2లో

### మూసీ మురికి కన్నా

# కల్వకుంట్ల విషం ప్రమాదం

### ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా



- పేదల జోలికి వెళ్లకుండా కబ్జాదారుల భరతం పడుతోంది
- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

**ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.**

- రంగారెడ్డి, జూన్ 18 (సింగిడి):

గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొం దరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని ...మిగతా 2లో

### భిన్నత్వంలో ఏకత్వానికి

## ప్రతిబింబంగా భారత్

### ప్రపంచ రూపురేఖలను మార్చే స్థాయికి....: మోదీ

**న్యూఢిల్లీ, జూన్ 18 (సింగిడి):**

పారిస్ అద్భుతమైన ఆలోచనలు, ఆవిష్కరణల నగరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రవాస భారతీయులు ఈ నగరానికి కొత్త కాంతులు తెచ్చారని, భారత్ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తున్నారని అన్నారు. జీ7 సదస్సులో పాల్గొన్న అనంతరం పారిస్‌కు వెళ్లిన ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. 'చాయ్‌వాలాను భారతదేశం ప్రధానిని చేసింది. 12 ఏళ్లపాటు దేశానికి సేవలందించడం గౌరవంగా భావిస్తున్నా. 25 కోట్ల మందిని పేదరికం నుంచి ...మిగతా 2లో



## రిజిస్ట్రేషన్ సర్వర్ నిర్వహణ పనులు

26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలకు విరామం

జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు

2

### చంద్రబాబు అధ్యక్షతన

## ఎస్ఐపీబీ సమావేశం

పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఆమోదం



### మైనార్టీల అభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముసాయిదా

వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం

కొత్త శ్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు

డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

సమావేశానికి హాజరైన మంత్రి అజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు

2



### టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో

## మహిళా శక్తి క్యాంటీన్

# పచ్చదనమే ప్రగతికి పునాది



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి

వన మహోత్సవంలో మంత్రి అడ్లూరి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ పిలుపు

**ధర్మపురి, జూన్ 18 ( సింగిడి )**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటే సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, రైతులకు మెరుగైన దిగుబడులు లభిస్తాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ అసమతుల్యతే ప్రధాన కారణమని అన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు.





2

### నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు

## ఉచిత ప్రయాణం

మంత్రి పొన్నం ప్రభాకర్

### నెత్తురోడిన రాష్ట్ర

## రహదారులు

### వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి

మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి

వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
19 జూన్ 2026

# హర్మూజ్‌లో కదులుతున్ననౌకలు!

ఒప్పందం తక్షణమే అమల్లోకి రావడంతో కొన్ని నౌకలు ఇప్పటికే ఆ మార్గంలో బయలుదేరినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఇరాన్–అమెరికా మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పేర్కొనే హర్మూజ్‌కు మళ్లీ ఊపిరి పోసినట్లయ్యింది. ఆంక్షల నేపథ్యంలో కొంతకాలంగా అక్కడ వందలాది నౌకలు చిక్కుకుపోగా.. తాజాగా పరిస్థితులు కుదుటపడడంతో తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ఆయా నౌకలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒప్పందం తక్షణమే అమల్లోకి రావడంతో కొన్ని నౌకలు ఇప్పటికే ఆ మార్గంలో బయలుదేరినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. నౌకల రాకపోకలను ట్రాకింగ్ చేసే వ్యవస్థ 'విండ్‌వార్డ్' ప్రకారం.. హర్మూజ్‌లో సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన నౌకల్లో కొన్ని గురువారం ఉదయమే తమ ప్రయాణాన్ని ప్రారంభించాయి. తొలుత చైనాతో సంబంధమున్న ఐదు నౌకలు కదలగా, యూరోపియన్ జెండాలున్న రెండు నౌకలు తర్వాత క్రమంలో వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఏడు నౌకలు కూడా గత వంద రోజులకుపైగా హర్మూజ్ సమీపంలో చిక్కుకుపోయినవేనని సమాచారం.

**అమెరికా- ఇరాన్ యుద్ధానికి ముగింపు**

వీటితోపాటు మరికొన్ని నౌకలు కూడా లంగరు వేసిన ప్రదేశం నుంచి జలసంధి వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో హాంకాంగ్, జపాన్‌కు చెందిన భారీ నౌకలు ఉన్నట్లు తెలిసింది. కాల్పుల విరమణ ఒప్పందం, వ్యూహాత్మక జల మార్గాన్ని తెరవడం వంటి అంశాలపై విశ్వాసం పెరుగుతోందనడాన్ని తాజా పరిణామం సూచిస్తోందని నౌకల ట్రాకింగ్ వ్యవస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే, హర్మూజ్‌లో పూర్తిగా సాధారణ పరిస్థితులు నెలకొనడం అనేది శాంతి ఒప్పందం అమలుపై ఇరుపక్షాల నిబద్ధతపైనే ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# రిజిస్ట్రేషన్ సర్వర్ నిర్వహణ పనులు

**హైదరాబాద్,జూన్ 18 (సింగిడి):**

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలు షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ సర్వర్ నిర్వహణ పనుల ద్వారా సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే జూన్ 26న మొహరమ్, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో, మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించామని తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్, జూన్ 18 (సింగిడి)**

రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక, వక్ఫ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

# చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం

**అమరావతి, జూన్ 18(సింగిడి):**

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 18వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. ఇంధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, పెట్టుబడులు–మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు సంబంధించిన ప్రాజెక్టుల ప్రతిపాదనలపై చర్చించి ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. దాదాపు 50కి పైగా ప్రాజెక్టులకు సంబంధించి ఎస్ఐపీబీ సమావేశంలో చర్చించినట్టు సమాచారం. సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్ వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా భారత్

మొదటి పేజీ తరువాయి

బయటకు తీసుకువచ్చాం. భారత్‌లోని గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చంద్రయాన్ విజయవంతానికి ప్రపంచం సాక్షిగా నిలిచింది. ప్రపంచ రూపురేఖలను మార్చే స్థాయికి భారత్ ఎదిగింది. భారత్ – ఫ్రాన్స్ మధ్య వాణిజ్యం మరింత పుంజుకుంది. భారత్ – ఫ్రాన్స్ బంధాలు స్థిరత్వానికి ప్రతీక. 12 ఏళ్లలో భారత్ జీడీపీ, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల నిర్మాణం రెట్టింపయ్యాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం

మొదటి పేజీ తరువాయి



సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూ సీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచరస◌టీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయ స్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు.హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

మొదటి పేజీ తరువాయి




దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ,తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింకలేతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ◌Ö–లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

# 30న రైతు భరోసా నిధులు విడుదల

మొదటి పేజీ తరువాయి




మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్టాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ– జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్టాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

**హైదరాబాద్, జూన్ 18 (సింగిడి)**

హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్బీఐలో ఎస్బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది.

# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

**హైదరాబాద్, జూన్ 18 (సింగిడి)**

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్‌లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# హిమాచల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**న్యూఢిల్లీ, జూన్18 (సింగిడి):**

హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో వాహనం లోయలో పడి ఏడుగురు దుర్మరణం చెందారు. మస్రుండ్–హమాల్ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. బుధవారం అర్ధరాత్రి ఈఘటన చోటుచేసుకుంది. మృతుల్లో డ్రైవర్‌తో పాటు ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వారు ఓ మతపరమైన వేడుకకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ఘటనా స్థలికి చేరుకున్న రెస్క్యూ సిబ్బంది మృత దేహాలను వెలికితీశారు

# టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటీన్

**పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్,జూన్ 18 (సింగిడి):**

మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన 'మహిళా శక్తి క్యాంటీన్'ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సందర్శించి, పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు, అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, గారు డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఐటి శివాజీ , డైరెక్టర్ ఆపరేషన్స్ ఔ.నరసింహ , డైరెక్టర్ ఫైనాన్సు కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

హైదరాబాద్,జూన్ 18 (సింగిడి):

రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభాతవర్ణ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
19-6-2026

### అక్షరాల ఒడిలో.. ఆత్మీయత ముడిలో

# కలెక్టర్ 'అమ్మ'గా మారిన వేళ!

నినాదం స్పెషల్ స్టోరీ..



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 18, (సింగిడి):** అధికారం అంటే కేవలం ఏసీ గదుల్లో కూర్చొని ఫైళ్లపై సంతకాలు చేయడం మాత్రమే కాదు... ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడం, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలవడం అని నిరూపించారు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక. సాధారణంగా ఐఏఎస్ అధికారుల పర్యటనలు అంటే గంభీర వాతావరణం, అధికారుల హడావుడి కనిపిస్తుంది. కానీ, ఇక్కడ మాత్రం పూర్తిగా భిన్నమైన, అత్యంత మానవీయమైన దృశ్యం ఆవిష్కృతమైంది.

**పలక పట్టిన చిన్నారి.. అక్షరం దిద్దించిన కలెక్టర్**

నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామములోని అంగన్వాడి కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేరిన (అంగన్‌వాడీ) చిన్నారులకు, ప్రభుత్వ పాఠశాల పర్యటన సందర్భంగా కలెక్టర్ నేరుగా చిన్నారుల మధ్యకు వెళ్లారు. అక్కడ పలక చేతపట్టుకుని కూర్చున్న ఒక చిన్నారిని చూసి, ఆమెలోని అధికార హోదా కరిగిపోయింది. ఒక తల్లిగా మారి ఆ చిన్నారి పక్కనే నేలపై కూర్చున్నారు.ఆ చిన్నారి చేతిని తన చేతిలోకి తీసుకుని, బలపంతో పలకపై అక్షరాలు దిద్దిస్తున్న ఆ దృశ్యం చూసే ప్రతి ఒక్కరి కళ్లల్లో ఆనందాన్ని నింపింది. కలెక్టర్ ప్రియాంక ఎంతో ఓపికగా, చిరునవ్వుతో ఆ చిన్నారికి ఒడిలో ఉన్నంత ఆత్మీయతను పంచుతూ "ఓనమాలు" నేర్పిస్తుంటే, చుట్టూ ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆ క్షణాన్ని ఆశ్చర్యంతో, సంతోషంతో వీక్షించారు. ఈ స్టోరీ ఇచ్చే గొప్ప సందేశం నమ్మకం పెంచే అడుగు ప్రభుత్వ విద్యా వ్యవస్థలపై, అంగన్‌వాడీ కేంద్రాలపై సామాన్యులకు నమ్మకం కలిగించేలా ఈ చిత్రం ఉందన్నది నిజం. ఉన్నతాధికారులే స్వయంగా పిల్లల చెంతకు చేరినప్పుడు ఆ వ్యవస్థపై గౌరవం మరింత పెరుగుతుంది.

**స్ఫూర్తిదాయక పునాది**

కలెక్టర్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేసుకున్న ఆ చిన్నారి పెద్దయ్యాక, తన జీవితంలో మొదటి అక్షరాన్ని ఒక ఐఏఎస్ అధికారి దిద్దించారని తెలుసుకున్నప్పుడు ఆ బిడ్డ పొందే స్ఫూర్తి, గర్వం మాటల్లో చెప్పలేనివి. అది ఆ చిన్నారిని ఉన్నత శిఖరాలకు చేర్చేలా ప్రేరేపిస్తుంది.

**అహం లేని అధికారం**

ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా, సమాజంలోని చివరి వ్యక్తికి, చిన్నారికి కనెక్ట్ అవ్వడమే నిజమైన నాయకత్వ లక్షణం అని కలెక్టర్ సిహెచ్ ప్రియాంక నిరూపించారు. చదివే రేపటి భవిష్యత్తుకు పునాది. ఆ పునాదిని ఇంతటి ప్రేమతో ఆత్మీయతతో వేసిన కలెక్టర్ ప్రియాంక చొరవ నిజంగా అభినందనీయం కేవలం ఒక విధి నిర్వహణ కాదు సమాజానికి ఒక దిక్సూచి.

## ఇందిరమ్మ ఇళ్లకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ భూమి పూజ



**కామారెడ్డిబ్యూరో, జూన్ 18(సింగిడి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు రావుల పెద్ద ఎల్లమ్మ, భిక్షపతి, దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... తమకు జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి , జిల్లా పాలనాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, డిఎల్ పి ఓ శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



**బిక్కనూరు,జూన్18(సింగిడి):** పేదలకు సొంతింటి కలను సాకారం చేసే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా బిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను కానుకగా అందజేసి, వారి నూతన గృహ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపూరి రాణి రాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి వినోద్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, టెంపుల్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణారెడ్డి, శశికుమార్, పనాసా రాజు, భవాని ధర్మస్వామి, చంద్రకళ వీరేశం, కూతరు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, వీడీసీ కార్యదర్శి నాగర్తి భూమ్‌రెడ్డి, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల విశ్వాసాన్ని దెబ్బ తీసే విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు

మండల వ్యవసాయ అధికారి మంజుమ్ ఖాన్, వైరా ఎస్సై రామారావు



**వైరా,జూన్ 18 (సింగిడి):** రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించే ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వ్యాపారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వైరా మండల వ్యవసాయ శాఖ అధికారి మంజూం ఖాన్, వైరా ఎస్సై పుష్పాల రామారావు హెచ్చరిం చారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని తాటిపూడి గ్రామంలో విత్తన దుకాణాలు, గోదాములు, రవాణా కేంద్రాలపై ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఆయా దుకాణాలలో రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ తదితర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువుల ధరలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అనే విషయాలపై ఆరా తీశారు. విత్తన ప్యాకెట్లపై ఉన్న తయారీ, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసే వ్యాపారులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా తనిఖీలు చేస్తామని తెలిపారు. తనిఖీలలో వ్యవసాయ శాఖ ఏడిఏ కరుణశ్రీ పాల్గొన్నారు.

## మణుగూరులో కలెక్టర్ విస్తృత పర్యటన

ముంపు ప్రాంతాలను పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు



**మణుగూరు జూన్ 18 (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పట్టణంలో విస్తృతంగా పర్యటించి ముంపు ప్రాంతాలైన గాంధీనగర్, సుందరయ్య నగర్ ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ గనుల నుంచి వర్షాకాలం వరద నీరు వచ్చి ఈ గ్రామాలపై పడే ప్రమాదం ఉన్నట్లు ఆయన ముందుగానే గుర్తించారు. సింగరేణి అధికారుల సహాయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వరదలు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలతో పాటు, ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యంగా పట్నంలో డ్రైనేజీలు కాలువలు పూడికను వెంటనే తీపించాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ను ఆదేశించారు. వర్షాకాలంలో వరదలు వచ్చే సమయంలో ఇరిగేషన్ శాఖ తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ డి రమేష్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, స్థానిక తాసిల్దార్ అద్దంకి నరేష్, డి రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారణ్య విద్యాలయ ప్రారంభం

నాణ్యమైన విద్యకు ఎమ్మెల్యే విజయుడు పిలుపు



**గద్వాల ప్రతినిధి జూన్ 18 (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణం భారత్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన 'విద్యారణ్య విద్యాలయ' ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు.అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించిన ఎమ్మెల్యే, నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లను పెంపొందించేలా యాజమాన్యం కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన విద్యా బోధన అందిస్తామని పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, కౌన్సిలర్లు శివ, డాక్టర్ కృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్, మౌల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఎమ్మెల్సీ

రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం
కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి



**నాగర్ కర్నూల్, జూన్ 18 (సింగిడి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ఎరువుల కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, జిల్లాలోని 20 మండలాల్లో ఈ సేవలను నేటి నుండి ప్రారంభించగా, రైతులు ఇకపై నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో హాకా, ఆగ్రోస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రాల డీలర్లతో యూరియా పంపిణీ, యూరియా నిల్వలు, యాప్ ఆధారిత బుకింగ్ విధానం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి చేతుల మీదుగా యూరియా బుకింగ్ యాప్‌ను అధికారికంగా ప్రారం భించారు. అనంతరం యాప్ పనితీరు, రైతులకు అందించే సేవలు, బుకింగ్ విధానం గురించి అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనికోరారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభంగా వివరించి, ప్రతి రైతు సాంకేతిక సేవలను వినియోగించుకునేలా సహకరించాలని ఆయన సూచించారు. యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ సేవలను విజయవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే యూరియా నిల్వలను సిద్ధం చేసిందని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ జరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా వాటిని సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎరువులు సులభంగా అందే విధంగా వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. రైతులు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, హాకా, ఆగ్రోస్ ప్రతినిధులు, సహకార సంఘాల అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ ఇంజనీరింగ్ విద్యార్థినిల స్నాతకోత్సవం




**నిజామాబాద్ ప్రతినిధి, జూన్ 18 (సింగిడి) :** కాకతీయ ఇంజనీరింగ్ మహిళ కళాశాలలో 2022-2026 సంవత్సరాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థినిలకు శ్రీరామ గార్డెన్స్ లో గురువారం పట్ట భద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యునివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి విచ్చేసి విద్యార్థినిలకు ఇంజనీరింగ్ పట్టాలను అందించారు. అనంతరం విద్యార్థినిలను అభినందిస్తూ, నేటి సమాజంలో విద్యార్థినిలు అన్ని రంగాల్లో ముందుండాలని, వాటికి తగినటువంటి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని, ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ప్రసంగించారు. అనంతరం కళాశాల డైరక్టర్ చెరుకూరి రజనీకాంత్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో మా కళాశాల నుండి 232 మంది విద్యార్థినిలు ఇంజనీరింగ్ పట్టాలు పొందడం, చాలా మంది విద్యార్థినిలు సాఫ్ట్ వేర్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం కాకతీయ విద్యాసంస్థలకు ఎంతో గర్వ కారణమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సెల్వ కుమార్ రాజా మాట్లాడుతూ మా కళాశాల నుండి పట్టాలు పొందిన విద్యార్థినిలు ఏ రంగంలో ఉన్నా కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి గర్వ కారణంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ నాగేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ జి.సాయారెడ్డి, వివిధ శాఖల అధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ పనులు

# వేగవంతం చేయాలి

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కల్వకుర్తి,18 (సింగిడి):** తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈరోజు క్షుణ్ణంగా పరిశీలించారు. భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మహత్తర లక్ష్యానికి ప్రతీకగా నిర్మితమవుతున్న ఈ విద్యా ప్రాంగణం పనుల పురోగతిని ఆయన స్వయంగా సైట్‌లో పర్యటించి సమీక్షించారు. సైట్ ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి మొత్తం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గారు పాఠశాల భవనాలు, అత్యాధునిక తరగతి గదులు, విద్యార్థుల హాస్టళ్లు, సైన్స్--కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్స్, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థలు వంటి అన్ని అంశాలను లే అవుట్ ప్రకారం సమగ్రంగా అంచనా వేశారు. ప్రతి పనికి సంబంధించిన సాంకేతిక వివరాలను తెలుసుకుంటూ నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరియు పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కేవలం ఒక పాఠశాల నిర్మాణం మాత్రమే కాదని, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర విద్యా యజ్ఞమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి కలల ప్రాజెక్టుగా ఇది రూపుదిద్దుకుంటోందని ఆయన తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించిన ఎమ్మెల్యే, నిర్ణీత గడువుకంటే ముందుగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, జాప్యం లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఖానాపూర్‌లో నిర్మితమవుతున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవిష్యత్తులో రాష్ట్రంలోనే ఆదర్శ విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపే జ్ఞాన మందిరంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామివారి కల్యాణం



**చింతపల్లి, జూన్ 18 (సింగిడి) :** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 11.00 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి స్వరూపమైన వేప, రావి చెట్టు కు భక్త జన సందోహం మధ్య కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర హోమం, భూ వరాహ స్వామి హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కల్యాణ మూర్తులను ఆ క్షేత్ర వేద పండితులు ఆలయానికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కల్యాణ మూర్తులతో పాటు శ్రీ షిరిడి సాయి బాబా విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించిన పూల రథం పై భక్త జనం వెంట రాగా మహిళల కోలాట నృత్యాలు , భజనలతో ఎంతో ఘనంగా ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొని రావడం జరిగింది. ఈ సందర్భంగా స్వామి కళ్యాణ మండపాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని శ్రీశైలం క్షేత్ర వేద పండితులు ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీశైలం క్షేత్ర ఆలయ బోర్డు సభ్యుడు కాశీనాథ్, స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, కమిటీ సభ్యులు కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీనివాస్, చండీయాగ నిర్వాహకుడు నవీన్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

# కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

పాలిటెక్నిక్ విద్యార్థులకు కలెక్టర్ దిశా నిర్దేశం





**గద్వాలబ్యూరో,జూన్18(సింగిడి)** ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి, తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న వివిధ కోర్సులు, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగారు. వివిధ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని, అవసరమైన సెమినార్లు నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని అక్కడి అధ్యాపకులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ గద్వాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉండగా ఈ సంవత్సరం నూతనంగా సైబర్ ఫిజికల్ సిస్టం సెక్యూరిటీ కోర్స్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పాలిసెట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఇప్పటికే వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కొత్త కోర్సులోకి మారేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా ఈ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా అవకాశం ఉంటుందన్నారు. వడ్డేపల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి కళాశాలలో చేరిన విద్యార్థులు గద్వాలలోని పలు వసతి గృహాల్లో ఉన్నందున వారు కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని గద్వాల మండలానికి చెందిన కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొత్త విద్యార్థుల అడ్మిషన్స్ గురించి అడిగి, నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు రోజులవుతున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటిని ప్రశ్నించారు. పలు తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. మెనూ ప్రకారం భోజనం వండించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు.కస్తూర్బా విద్యాలయ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి,పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని గోపీలత, తదితరులున్నారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**కల్వకుర్తి,జూన్ 18 (సింగిడి) :** కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో జిల్లా కలెక్టర్ పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను సందర్శించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రభుత్వ సహాయం అందుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరవేయడం అధికారుల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిం చాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో గృహ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెల్దండ గ్రామానికి చెందిన ఉడుత సుమాతమ్మ భర్త ఉడుత జంగయ్య దివ్యాంగు డని, ఆయనకు సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తదనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల అవసరాలు, భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేం దుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అల్లం త్వరగా ఎండిపోతోందా?

## ఈ చిట్కాలు పాటిస్తే నెల రోజులైనా పచ్చిగా, తాజాగా ఉంటుంది!

ప్రతి ఇంటా వంటింట్లో అల్లం ఖచ్చితంగా ఉంటుంది. కూరల రుచిని పెంచడానికే కాకుండా, జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలకు ఔషధంగా, ఉదయాన్నే తాగే అల్లం టీ కోసం దీనిని ఎక్కువగా వాడుతుంటాం. అయితే, అల్లాన్ని సరిగ్గా నిల్వ చేయకపోతే అది చాలా త్వరగా ఎండిపోతుంది. లేదా తేమ ఎక్కువైతే బూజు పట్టి కుళ్ళిపోతుంది. దీనివల్ల డబ్బులు వృథా అవ్వడమే కాకుండా వంటల్లో సరైన రుచి కూడా రాదు. అల్లాన్ని 15 నుండి 30 రోజుల పాటు మునుపటిలాగే పచ్చిగా, తాజాగా ఉంచే కొన్ని అద్భుతమైన వంటింటి చిట్కాలు ఇప్పుడు చూద్దాం.



టిష్యూ పేపర్, ఎయిర్ టైట్ కంటైనర్ పద్ధతి: అల్లం పాడవడానికి ప్రధాన కారణం దానిపై ఉండే అదనపు తేమ. మార్కెట్ నుండి తెచ్చిన అల్లాన్ని ముందుగా బాగా తుడిచి, ఆరబెట్టాలి. ఆ తర్వాత దానిని ఒక టిష్యూ పేపర్‌లో చుట్టి, గాలి చొరబడని డబ్బాలో (గాలిచొరబడని జాడీ/కంటైనర్) పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. టిష్యూ పేపర్ అల్లంలో ఉండే అదనపు తేమను పీల్చుకుంటుంది. దీనివల్ల అల్లం దాదాపు 3-4 వారాల పాటు అస్సలు పాడవదు.



జిప్ లాక్ బ్యాగుల వాడకం: అల్లాన్ని నిల్వ చేయడానికి జిప్ లాక్ కవర్లు బాగా ఉపయోగపడతాయి. అల్లాన్ని కవర్‌లో పెట్టిన తర్వాత, అందులో గాలి లేకుండా పూర్తిగా ప్రెస్ చేసి జిప్ లాక్ చేయాలి. దీనిని ఫ్రిజ్ లోని వెజిటబుల్ బాక్స్‌లో ఉంచితే చాలా రోజుల వరకు తాజాగా ఉంటుంది.

పేపర్ బ్యాగ్ లేదా బ్రౌన్ కాగితపు సంచులు: ప్లాస్టిక్ కవర్లలో అల్లాన్ని ఉంచితే తేమ చేరి త్వరగా పాడవుతుంది. అందుకే బ్రౌన్ పేపర్ బ్యాగ్స్ లేదా సాధారణ కాగితపు సంచులలో అల్లాన్ని ఉంచి ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది. కాగితం వాతావరణాన్ని పొడిగా ఉంచడానికి సహాయపడుతుంది.

అల్లం వెల్లుల్లి పేస్ట్ లేదా ఫ్రీజర్ పద్ధతి: ఒకవేళ మీరు అల్లాన్ని చాలా నెలల పాటు నిల్వ చేయాలనుకుంటే, దానిని చిన్న ముక్కలుగా కోసి లేదా పేస్ట్‌లా చేసి డీప్ ఫ్రిజ్ లో ఐస్ ట్రేలలో పెట్టి నిల్వ చేయవచ్చు. అవసరమైనప్పుడు ఒక ముక్కను తీసుకుని వాడుకోవచ్చు. అలాగే అల్లం, వెల్లుల్లిని కలిపి పేస్ట్ చేసి, అందులో కొద్దిగా ఉప్పు, నూనె కలిపి నిల్వ చేసుకున్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అయితే, అల్లాన్ని నిల్వ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయి. అల్లాన్ని ఫ్రిజ్‌లో పెట్టే ముందు ఎట్టిపరిస్థితుల్లోనూ నీటితో కడగకూడదు. ఒకవేళ కడిగితే, అది పూర్తిగా ఆరిపోయే వరకు ఎండబెట్టిన తర్వాతే నిల్వ చేయాలి. అల్లం కొనేటప్పుడే గట్టిగా, తాజా ముడతలు లేని పొట్టు ఉన్నవాటిని ఎంచుకోవాలి. మెత్తబడిన అల్లాన్ని కొంటే అది త్వరగా కుళ్ళిపోతుంది. కత్తిరించిన అల్లం ముక్కలను మిగిలిన అల్లంతో కలపకుండా విడిగా వాడుకోవాలి.

# తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**జమ్మికుంట, జూన్ 18 (సింగిడి) :** కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం సాయంత్రం జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఏ పనిని కూడా పెండింగ్ లో లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. జమ్మికుంట ఇల్లంతకుంట మండలాలకు సంబంధించిన పలు రికార్డులను ఎమ్మార్వో భాస్కర్ తో చర్చించి కార్యాలయానికి వచ్చే లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గడ్డం శంకర్ జి పి ఓ రాజాకిరణ్ తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్కార్ బడిలో చేర్పిస్తే ఇంటిపన్ను నల్లా బిల్లు మాఫీ



**కామారెడ్డిబ్యూరో, (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కామారెడ్డి జిల్లా జుక్కల్ సెగ్మెంట్‌లోని నిజాంసాగర్ మండలం మంగ్లూర్ గ్రామపంచాయతీ ఆ గ్రామస్థులకు ఆకర్షణీయమైన బంపర్ ఆఫర్ ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను, నల్లా బిల్లును మాఫీ చేస్తామని సర్పంచ్ రాజు బహిరంగ ప్రకటన చేసారు. 'ప్రైవేటుకు పోటీగా ప్రభుత్వ బడి' అనే నినాదంతో చేపట్టిన ఈ నిర్ణయానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించేందుకు గ్రామస్తులు ముందుకు గ్రామస్థులు ముందుకు వస్తున్నారు.

# బరువు తగ్గడంతోపాటు రక్తం పెరుగుతుంది..

## ఈ సీజన్‌లో అన్ని వయస్సుల వారు తాగాల్సిన అద్భుతమైన డ్రింక్



**ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం అనేక మార్గాలను అన్వేషిస్తున్న వారికి బార్లీ గింజలు ఒక అద్భుతమైన పరిష్కారం. ముఖ్యంగా ఉదయమే బార్లీ జావను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు.**

బార్లీ కేవలం ఒక ధాన్యం మాత్రమే కాదు.. అది పోషకాల గని అని.. ప్రతిరోజూ బార్లీ జావ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఆధునిక జీవనశైలిలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు షుగర్, బీపీ, కొలెస్ట్రాల్.. బార్లీ



గింజలు ఈ మూడింటినీ అదుపులో ఉంచడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. వీటిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల రక్తపోటును సమర్థవంతంగా నియంత్రిస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే, బార్లీలోని పీచుపదార్థాలు (ఫైబర్) కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

బార్లీ జీర్ణవ్యవస్థకు కూడా మేలు చేస్తుంది. అధిక పీచుపదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, మలబద్ధకాన్ని నివారిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలకు సహాయపడతాయి. ఉదయమే బార్లీ నీరు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థ పదార్థాలు, విషపదార్థాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. ఇది శరీరాన్ని శుభ్రపరచి, మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. పెద్దపేగును శుభ్రపరచడం ద్వారా కోలన్ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు రాకుండా కూడా రక్షణ కల్పిస్తుంది.

బరువు తగ్గాలనుకునేవారికి బార్లీ వాటర్ ఒక సహజసిద్ధమైన మిత్రుడు. ఇది శరీర మెటబాలిజంను క్రమబద్ధీకరిస్తుంది. పీచుపదార్థాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించి, అతిగా తినకుండా నిరోధిస్తాయి. ఫలితంగా, బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

బార్లీలో కేవలం పీచు, పొటాషియం మాత్రమే కాకుండా విటమిన్ ఎ, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉన్నాయి. విటమిన్ ఎ కంటిచూపును దీర్ఘకాలం పాటు పదిలంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది, రక్తకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. కాల్షియం, ఫాస్ఫరస్ ఎముకలను మరింత బలంగా చేస్తాయి. ఎముకల సాంద్రతను పెంచుతాయి. అంతేకాకుండా, బార్లీ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వివిధ వ్యాధుల నుండి కాపాడుతుంది.

బార్లీ జావాను తయారు చేయడం చాలా సులభం. ఒక గుప్పెడు బార్లీ గింజలను ఒక లీటరు నీటిలో వేసి 10 నుండి 15 నిమిషాలు బాగా మరిగించాలి. ఆ తర్వాత ఆ నీటిని వడగట్టి ఒక గ్లాసులోకి తీసుకోవాలి. దీనికి సగం నిమ్మకాయ రసం, ఒక చెంచా తేనె కలిపి ప్రతిరోజూ ఉదయం పరగడుపున తాగాలి. లేదా బార్లీ పొడి.. రెండు స్పూన్లను నీటిలో కలిపి మరిగించి తీసుకోవచ్చు..

ఈ పానీయం శరీరాన్ని రిఫ్రెష్ చేయడమే కాకుండా పైన పేర్కొన్న అన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ సాధారణ అలవాటు మీ రోజువారీ ఆరోగ్యానికి అద్భుతమైన మార్పును తీసుకువస్తుంది.

## స్టాక్ మార్కెట్ Stock Market

# అమెజాన్ ప్రైమ్ డే సేల్ తేదీ ఖరారు.. మెంబర్‌షిప్ ధర తగ్గింపు




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ డే సేల్ కు సిద్ధమవుతోంది. జులై 4 నుంచి జులై 6 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనుంది. కేవలం ప్రైమ్ యూజర్ల కోసమే ఏటా నిర్వహించే ఈ సేల్‌లో ఎక్స్‌క్లూజివ్ డీల్స్, భారీ ఆఫర్లను అందించనుంది. ఆఫర్ల వివరాలు ఇంకా ప్రకటించలేదు. సేల్‌కు కొన్ని రోజుల ముందే ఈ వివరాలను కంపెనీ వెల్లడించనుంది.

జులై 4న రాత్రి 12 గంటలకు సేల్ ప్రారంభమవుతుంది. జులై 6న రాత్రి 11.59 నిమిషాలకు ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సేల్‌లో వన్‌ప్లస్, శాంసంగ్ బ్రాండ్లకు సంబంధించిన 500 కొత్త ప్రొడక్ట్‌లపై భారీ ఆఫర్లు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. ఎకో స్మార్ట్ స్పీకర్స్, అలెక్సా, ఫైర్ టీవీలపై 45 శాతం వరకు ఆఫర్లు అందించనుంది. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు హోల్డర్లకు అదనంగా 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు హోల్డర్లకు 5 శాతం క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది.

తగ్గిన ప్రైమ్ మెంబర్‌షిప్ ధర ప్రైమ్‌డే సేల్ 10వ ఎడిషన్ సందర్భంగా కొత్తగా ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకునే వారి కోసం ఆఫర్‌ను ప్రకటించింది. ప్రస్తుతం స్టాండర్డ్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఏడాది ప్లాన్ ధర రూ.1499 ఉండగా.. రూ.999కి తగ్గించింది. ప్రైమ్ లైట్ సబ్‌స్క్రిప్షన్ రూ.799 నుంచి రూ.599కే అందిస్తోంది. కేవలం షాపింగ్ డిస్కౌంట్‌ల కోసం అందించే ఎడిషన్ ప్లాన్‌ను రూ.399 నుంచి రూ.299కి తగ్గించింది. త్వరగా ప్రొడక్ట్‌లను తెలుసుకునేందుకు ఏఐ టూల్స్‌నూ ఆఫర్ చేస్తోంది. కొనుగోలుదారులకు అమెజాన్ పే లేటర్ సదుపాయం కూడా అందిస్తోంది.

## మారుతీ, టాటా బాటలోనే కియా..

# జులై నుంచి కార్ల ధరలు పెంపు



డాలర్‌తో పోలిస్తే రూపాయి అస్థిరత, ముడిసరకు ధరలు భారంగా మారడంతో ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. దీంతో తమ కార్ల ధరలను పెంచేస్తున్నాయి. ప్రముఖ కార్ల కంపెనీలైన మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ, హ్యుందాయ్ వంటివి ఇప్పటికే ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. తాజాగా ఆ జాబితాలోకి కియా కూడా చేరింది. జులై 1 నుంచి తన మోడళ్ల ధరను 2 శాతం వరకు పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ముడి సరకుల ఖర్చు, నిర్వహణ వ్యయం పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ , విద్యుత్ వాహన సెగ్మెంట్‌లోని మోడళ్లు, వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని కియా పేర్కొంది. పెరుగుతున్న తయారీ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ పెంపు అనివార్యంగా మారిందని తెలిపింది. పెద్ద మొత్తంలో భారాన్ని కంపెనీ భరిస్తూ.. వినియోగదారులపై ఆ ప్రభావం పడకుండా స్వల్ప మొతాదులోనే ధరల పెంపు చేపడుతున్నట్లు ప్రకటించింది. దేశీయంగా సెల్టోస్, సోనెట్, కరెన్స్, క్లావిస్, సైరోస్, కార్నివాల్‌తో పాటు జుఎ6, జుఎ9 మోడళ్లను కంపెనీ విక్రయిస్తోంది. టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ ఇండియా, మెర్సిడెజ్ బెంజ్, నిస్సాన్ జులై నుంచి కార్ల ధరలు పెంచుతుండగా.. మారుతీ సుజుకీ జూన్ 1 నుంచే తన మోడళ్ల ధరలను రూ.30 వేల వరకు పెంచిన విషయం తెలిసిందే.

# కృత్రిమ మేధస్సుపై శిక్షణ తరగతులు

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ వారిచేత చేపట్టిన అన్న - అక్క మెంటర్ షిప్ కార్యక్రమములో భాగంగా డిగ్రీ చివరి సంవత్సరపు విద్యార్థిని, విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విభాగంలో రెండు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి శిక్షకులుగా పి. అవనికేత్ సహ ఆచార్యులు సింగపూర్ కిట్స్ కళాశాల నుండి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు యొక్క పాత్రను వివరించారు. కృత్రిమ మేధస్సు అనేది మానవులలో ఉండే ఆలోచనా శక్తి, నేర్చుకునే సామర్థ్యం మరియు సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను కంప్యూటర్లు లేదా యంత్రాలు ప్రదర్శించేలా చేసే ఒక అధునాతన సాంకేతికత అని అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. కిరణ్ కుమార్, డా. ఎం. శామల, ఎల్. రవీందర్, డా. ఎస్. శ్రీనివాస్, డా.సి. రాజకుమార్, డా. మాధవి, కె. ఉమాకిరణ్ , పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మమత, డా.పి. సుష్మ



, డా. పి. రవిప్రకాశ్ రావు, రమేష్, ప్రశాంత్ , సాయికుమార్, అరుణ్ రాజ్, డా. పి. స్వప్న, దీనా, శ్రీకాంత్, అధ్యాపకేతర సిబ్బంది తిరుపతి, రఘు, శ్రీలత, గౌరమ్మ, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జగమెరిగిన మిమిక్రీ కళాకారుడు వేణుమాధవ్

**భారత దేశంలో మిమిక్రీ కళకు ఆయన ఆద్యుడు. ఎంతో మంది ప్రముఖుల వందలాదిగా గొంతులను సునాయాసంగా, యథాతథంగా అనుకరించేవారు. భారత్‌లో అనుకరించి, నవ్వించే కళగా మాత్రమే ఉన్న మిమిక్రీని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడు. రాష్ట్రపతులు, ప్రధానుల నుండి సామాన్యుల వరకూ దేశంలో ఆయన అపూర్వ, అపురూప కళను అభినందించని వారుండ రంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు గుర్తు పట్టారనుకుంటా. ఆయనే వందలాది గొంతుకల వేణు మాధవుడు.**

ధ్వన్యనుకరణ సామ్రాట్ అనే బిరుదును పొందిన, తెలంగాణ గర్వించ దగ్గ ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ళ వేణుమాధవ్ ( డిసెంబరు 28, 1932 - జూన్ 19, 2018 ) చిన్నప్పుడు ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నారు. అయినా ఆయన అమెరికా, బ్రిటన్ ఇంగ్లీష్ ఉచ్చారణలతో కూడా గొప్ప ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన సొంతంగా ఈ కళను సాధన చేశారు. స్వీయ పరిశీలన, స్వయం అధ్యయనంతో తనను తాను మెరుగు పరచు కుంటూ అత్యున్నత స్థాయిని అందుకున్న ప్రతిభాశాలి.

చిన్నతనంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం రాసిన ప్రహసనాల్లో నటించి తన ప్రతిభను చాటుకున్నా అప్పటి ప్రముఖ నటులు చిత్తూరు నాగయ్య, వేమూరు గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య తదితరుల సినిమాల ప్రభావంతో మిమిక్రీ కళపై మొగ్గు చూపారు. 1947 నుంచి ఈయన మిమిక్రీ ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. తెలుగు లోనే కాక ఇతర భాషల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చారు. ఐక్యరాజ్య సమితిలో కూడా ప్రదర్శన ఇచ్చారు. 1953 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్నిచ్చి గౌరవించింది..కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె మొదలైన ప్రముఖులు తమ రచనలను ఆయనకు అంకిత మివ్వడం ఆయన గొప్ప తనాన్ని స్పష్టం చేస్తుంది. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి కళా ప్రపూర్ణ, జె. ఎన్. టి. యు, కాకతీయ విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. తిరుపతిలో ఆయనకు గజారోహణం, పౌర సన్మానం జరిగాయి.

నేరెళ్ళ వేణుమాధవ్ వరంగల్ పట్టణం లోని మట్టెవాడలో శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932 డిసెంబరు 28న జన్మించారు. పండితుడైన తండ్రి, వరంగల్ పట్టణానికి వచ్చే ప్రముఖులందరికీ తన ఇంట్లోనే ఆతిథ్యం ఇస్తుండగా, అలా వచ్చిన వారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, వడ్డాది సుబ్బా రాయుడు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాశీ కృష్ణాచార్యులు, యర్రమిల్లి జగ్గన్న శాస్త్రి వంటి గొప్పవారి సాహితీ గోష్ఠుల ప్రభావం వేణుమాధవ్ మీద పడింది. సినిమాలంటే ఎంతో ఇష్టం. చిత్తూరు నాగయ్య నటించిన గృహలక్ష్మి, వందేమాతరం, దేవత, స్వర్గసీమ, పోతన, వేమన సినిమాలు చూసి, నాగయ్య కూడా ధ్వన్యనుకరణ చేయగలవారు కావడంతో ఆయన పై అభిమానంతో కేవలం స్వయం పరిశీలనతోనే ఆ రంగంలో ప్రవేశించారు. అలాగే వేమూరి గగ్గయ్య, మాధవపెద్ది వెంకట్రామయ్య నటించిన సినిమాలు చూసి, ఇంటికి రాగానే ఆ



సినిమాల్లోని పాటలను, పద్యాలను యథాతథంగా అనుకరించి చూపేవారు. అలా మొదలయ్యింది అయన మిమిక్రీ ప్రస్థానం.

1950 లో మెట్రిక్యులేషన్, 1952 లో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్సు కాలేజీలో చేరారు. నాటి ప్రిన్సిపాల్ బారు వెంకట రామనర్సు, ఇతర లెక్చరర్లు వారించినా వినకుండా, గుడ్ కాండక్టు కింద వేణుమాధవ్ కు ఆ రోజుల్లో అరవై రూపాయల స్కాలర్ షిప్ ( బర్సరీ ) మంజూరు చేశారు. ఆ డబ్బుతో పలు ఇంగ్లీషు సినిమాల్ని చూసి వాటిల్లోని ఆర్టిస్టుల గొంతులు, ముఖ్యమైన సన్నివేశాలు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నోట్స్ తో సహా వినిపిస్తే, రామనర్సు పరమానంద భరితులై "యూ విల్ బికం ఎ గ్రేట్ ఆర్టిస్ట్ ఇన్ ద వరల్డ్" అని, అయితే నీవు నా రెండవ కుమారుడవు అని మనసారా ఆశీర్వదించారు. ఆ దీవెనలే ఆయనను 'విశ్వ విఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్' గా ఎదిగేలా చేసాయి. 1953 లో ప్రభుత్వ పాఠశాల (జి సి ఎస్ స్కూలు హనుమకొండ) లో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మ సాగరం, హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ స్కూలు, మట్వాడ ఉన్నత పాఠశాల, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో పని చేశారు. అనంతర కాలంలో ప్రైవేటుగా బీ.ఏ. బీ. కాం పాసయ్యారు. తొలి ప్రదర్శన 1947 లో ఇచ్చారు. మలి ప్రదర్శన 1953 లో రాజమండ్రిలో జరిగిన థియేటర్స్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ లో బలరాజ సహానీ అధ్యక్షతన, గరికపాటి రాజారావు, దాడి గోవింద రాజులు, స్థానం నరసింహారావు, చాగంటి సన్యాసి రాజు తదితర ప్రముఖుల సమక్షంలో ఇచ్చారు. ఆయన ప్రదర్శనలు చూసిన పలువురు రాజకీయ ప్రముఖుల్లో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ఉన్నారు.

ఆస్ట్రేలియా, ఫిజీ దీవులు -1965, సింగపూర్, మలేషియా - 1968, పశ్చిమ జర్మనీ, ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికా, కెనెడా, లెబనాన్ - 1971, ఐక్యరాజ్య సమితిలో ప్రదర్శన - 1971, సింగపూర్,మలేషియా - 1975, అమెరికా, కెనెడా - 1976, దక్షిణాఫ్రికా, మారిషస్, సీషెల్స్ - 1976, సింగపూర్, మలేషియా - 1977, అమెరికా, కెనెడా - 1982, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ - 1987, మారిషస్ - 1990 తదితర దేశాలలో పర్యటించి ప్రదర్శనలు ఇచ్చారు.

వేణుమాధవ్ గారు నిర్వహించిన పదవుల్లో ఎం.ఎల్.సీ (1972-78), ఎఫ్.డీ.సీ డైరెక్టర్ (1976-77), సంగీత నాటక అకాడమీ సభ్యుడు (1974-78), సౌత్ జోన్ కల్చరల్ కమిటీ, తంజావూరు సభ్యుడు, దూరదర్శన్ ప్రోగ్రాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993-94), టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు (1993-96), రైల్వే జోనల్ యూజర్స్ కమిటీ సభ్యుడు (1993-96), ఎ.పి.లెజిస్లేటివ్ లైబ్రరీ కమిటీ సభ్యుడు (1972-75), రవీంద్ర భారతి కమిటీ సభ్యుడు (1974-78), ప్రభుత్వ అకాడమిక్ రివ్యూ కమిటీ సభ్యుడు (1975-76) తదితర పదవులు నిర్వహించారు.

ధ్వన్యనుకరణ సామ్రాట్, మిమిక్రీ సామ్రాట్, చుపె రుస్తుం ధ్వన్యను కరణ చక్రవర్తి, కళా సరస్వతి, స్వర్ కె రాజా, ధ్వన్యను కరణ ప్రవీణ, ధ్వన్యను కరణ కళానిధి, మిమిక్రీ రత్న, విశ్వ విఖ్యాత ధ్వన్యను కరణ సార్వభౌమ, మున్నగు బిరుదులు వరించాయి. 1977 ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి కళా ప్రపూర్ణ బిరుదు, 1982 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1987 జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వ విద్యాలయం, 1992 కాకతీయ విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు...1997 కనకాభిషేకం, 1998 ఎన్టీఆర్ ఆత్మ గౌరవ పురస్కారం, 2001 పద్మశ్రీ, 2005 తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు - 2018లో భాగంగా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా పురస్కారం అందజేయ బడింది. తిరుపతి పట్టణంలో గజారోహణం, పౌర సన్మానం జరిగాయి.పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 2018, జూన్ 19వ తేదీ తమ 85వ యేట కన్నుమూశారు. హనుమకొండలో నిర్మింపబడ్డ 'డా.నేరెళ్ళ వేణుమాధవ్ కళాప్రాంగణం ' సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు చక్కని వేదికగా ఉపయోగ పడుతున్నది. నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్' ను స్థాపించి ప్రతియేటా తన పుట్టిన రోజైన డిసెంబర్ 28న ప్రముఖ కళాకారులను పదివేల రూపాయల పురస్కారంతో సత్కరిస్తున్నారు.

2017లో నేరెళ్ల వేణుమాధవ్ పేరుతో పోస్టల్ శాఖ ప్రత్యేక కవర్‌ను విడుదల చేసింది. ఆయన పుట్టిన రోజైన డిసెంబర్ 28వ తేదీని తెలుగు రాష్ట్రాల్లో 'మిమిక్రీ డే'గా జరుపు కుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# మత్తు పదార్థాల నియంత్రణలో కంట్రోల్ టీం పనితీరు బేష్

**టీంను అభినందించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**



**హనుమకొండ,జూన్ 18, (సింగిడి):** యువతను మాదకద్రవ్యాలుఇతర చెడు వ్యసనాల బారిన పడకుండా రక్షించేందుకు డ్రగ్స్ కంట్రోల్ టీం నిర్వర్తించిన పనితీరును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15-07-2024న "డ్రగ్స్ కంట్రోల్ టీమ్" అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బృందం నిరంతర నిఘా, సమాచార సేకరణ, ప్రత్యేక దాడుల ద్వారా గంజాయి సంబంధిత నేరాల్లో పాల్గొనే వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో లా అండ్ ఆర్డర్ పోలీసులకు సహకరిస్తోందన్నారు. అదేవిధంగామాదకద్రవ్యాల దుష్పరిణామాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై విద్యార్థులు ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందనీ తెలిపారు. గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా లేదా అక్రమ విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని 8712685299, 87125844 73 ఫోన్ నంబర్ల ద్వారా పోలీసులకు అందించి ప్రజలు సహకరించాలని కోరారు. సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయనీ యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుతూ, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందనీ పేర్కొన్నారు.

**డ్రగ్స్ కంట్రోల్ టీమ్ సాధించిన ఫలితాలు**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్ర వ్యాల రవాణా, విక్రయాలు వినియోగాన్ని అరికట్టేం దుకు డ్రగ్స్ కంట్రోల్ టీమ్ 15-07-2024 నుండి 16-06-2026 వరకు చేపట్టిన చర్యల్లో గణనీయ మైన ఫలితాలు సాధించిందనీ వివరించారు. నమోదైన మొత్తం కేసులు 192 కాగాకేసుల్లో ప్రమేయం ఉన్న మొత్తం వ్యక్తులు 403 మంది ఉన్నారని తెలిపారు.స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు ఆస్తులు గంజాయి 1,241.110 కిలోగ్రాములు కాగాగంజాయి మొక్కలు 07ఓపియం 1,530 కిలోగ్రాములు బ్రౌన్ షుగర్ 0.2 గ్రాములుహషీష్ ఆయిల్ 22.4 లీటర్లుగంజాయి చాక్లెట్లు 251 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మాదకద్రవ్యాల మొత్తం విలువ రూ 8,57,90,978లు కాగాఇతర స్వాధీనం చేసుకున్న వస్తువులు నగదు రూ. 2,15,500లుమొబైల్ ఫోన్లు 601ద్విచక్ర వాహనాలు 63ఆటోలు 06 కార్లు 08 కౌన్సెలింగ్ చర్యలు ధూమపాన వ్యసనానికి గురైన 435 మంది వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించబడిందనీ పేర్కొ న్నారు.

**నిషేధిత మందుల అక్రమ విక్రయాలపై చర్యలు**

వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్న మెడికల్ షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించి, సం బంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

**పట్టణ తనిఖీలునిఘా చర్యలు**

రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విద్యాసంస్థలు వంటి రద్దీ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించబడ్డాయనీ పేర్కొన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో 100 గజాల పరిధిలో ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు చేపట్టి, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలను అరికట్టేం దుకు చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు.ఈ తనిఖీలు నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ సహాయంతో నిర్వహించగా, మాదకద్రవ్యాల నియం త్రణలో మరింత సమర్థవంతమైన ఫలితాలు సాధించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నా యన్నారు.

**అవగాహన కార్యక్రమాలు,కౌన్సెలింగ్**

మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వ్యక్తులు వారి తల్లిదండ్రులకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నా యన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ హాస్టళ్లలో మాదకద్ర వ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు చట్టపరమైన పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నా యనీ తెలిపారు. మేజిస్ట్రేట్ ఆ సర్టిఫికె ట్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుని, అర్హులైన వ్యక్తులపై నమోదైన గంజాయి స్మోకర్ కేసులను కొట్టివేసే అవకాశం కల్పించబడిందన్నారు. అందు వల్ల గతంలో గంజాయి స్మోకర్ కేసులు నమోదైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, గుర్తింపు పొందిన డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందిన అనంతరం సంబంధిత సర్టిఫికెట్‌ను న్యాయస్థానానికి సమర్పించాలని సూచిస్తున్నామన్నారు.సమాచారం అందించేందుకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 8712685299, 87125 84473మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం లో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొ న్నారు. మాదకద్రవ్యాల నిర్మూలించాలన్నారు.

# ఎంపీ అరవింద్ వ్యాఖ్యలు సరికాదు

- రైతు సంక్షేమంలో ఎమ్మెల్యే పాత్ర కీలకం
- మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి

**జగిత్యాల, జూన్ 18 (సింగిడి):** జగిత్యాల శాసనసభ్యుడు డా. సంజయ్ కుమార్‌పై ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలను జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధుల పట్ల మర్యాదపూర్వక భాషను ఉపయోగించాలని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని వారు సూచించారు.గత కొన్నేళ్లుగా జగిత్యాల నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ముఖ్యంగా మక్కలు, ధాన్యం, పసుపు, కందులు, మామిడి తదితర పంటల కొనుగోళ్లలో రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అందించిన సేవలను వివరిస్తూ, డీసీఎంఎస్, పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల ద్వారా పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయని పేర్కొన్నారు. రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందేలా స్థానిక స్థాయిలో నిరంతర చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజా వేదికలపై పరస్పర గౌరవాన్ని పాటించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి అగౌరవకర వ్యాఖ్యలను నివారించాలని ఎంపీ అరవింద్‌ను కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల వ్యవసాయ కమిటీ పాలకవర్గ సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

# నార్సింగి సర్కిల్‌లో జోనల్ కమిషనర్ పర్యటన



**రాజేంద్రనగర్, జూన్ 18 (సింగిడి):** నార్సింగి సర్కిల్ 45 పరిధిలోని 126వ వార్డులో గురువారం శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ విస్తృతంగా పర్యటించా రు. వార్డులో నెలకొన్న స్థానిక సమ స్యలను స్వయంగా పరిశీలించ డంతో పాటు, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సం దర్భంగా జోనల్ కమిషనర్ స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడ కూడదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువు లోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా రు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ ,శివ సాయి డి.ఈ, సంతోష్ ఎ.ఈ, శానిటరీ ఇన్స్పెక్టర్, లచ్చిరాం, వర్క్ ఇన్స్పెక్టర్లు శేఖర్, అరుణ్,వార్డు శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, పాల్గొన్నారు.

# విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 18(సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ఫోకస్ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఆయన చిట్యాల మండలం చల్లగరిక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భ నలో భాగంగా కలెక్టర్ పాఠశాల లోని అన్ని తరగతి గదులను, మ ధ్యాహ్న భోజన శాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థు లతో ముచ్చటించి, వేసవి సెలవు లు ఎలా గడిపారని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున విద్యార్థు లంతా క్రమం తప్పకుండా పాఠశా లకు హాజరు కావాలని పిలుపుని చ్చారు. పాఠశాలలో మౌలిక వసతు లు, సౌకర్యాలు అద్భుతంగా ఉన్నప్పటికీ, విద్యార్థుల హాజరు శాతం తక్కు వగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో హాజరు శాతాన్ని గణనీ యంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదే శించారు. అనంతరం విద్యార్థు లతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యా ర్థులను పలు ప్రశ్నలు అడిగి వారి జ్ఞానాన్ని పరిశీలించారు. విద్యా ర్థులంతా బాగా చదువుకుని, ఉన్నత విద్యావంతులుగా మారి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి అన్నిరంగాల్లో ముందంజలో ఉండా లని విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. విద్యార్థులలో పఠనాశక్తి పెంపొందించేందుకు లైబ్రరీ పుస్తకాలు అందుబాటులో ఉంచాల ని తెలిపారు. లైబ్రరీ కార్డు నిర్వహిం చాలని సూచించారు. అనంతరం విద్యారులతో కలిసి భోజనం చేసి, వంటలు బాగున్నాయని వంట వాళ్ళను అభినందించారు. ఈ కార్య క్రమంలో డీఈఓ రాజేందర్, తహసీ ల్దార్ వసంత రావు, ఎంపిడిఓ జయ శ్రీ, ఎంఈఓ రఘుపతి, సర్పం చ్ జంపయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్యలో రాణించాలి





**కలెక్టర్ ఆశీష్ సాంగ్వన్**



**కామారెడ్డిబ్యూరో, జూన్ 18 (సింగిడి):** క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్య లో రాణించాలని జిల్లా కలెక్టర్ ఆశీ ష్ సాంగ్వన్ అన్నారు. గురు వారం జిల్లాలోని గర్గుల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొ న్నారు. ఈ సంద ర్భంగా యూకేజీ తరగతిని ప్రారం భించి చిన్నారు లకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సంచార జాతుల పిల్లలను పాఠశాలలో చే ర్పించి వారికి అక్షరాభ్యాసం నిర్వ హించారు. పాఠశాల ప్రాంగణంలో రెండు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హైస్కూల్ , ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్త కాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గర్గుల్ పాఠశాలకు చెందిన నలుగురు జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 12 మంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందిం చారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్యలో కూడా రాణించాలని విద్యా ర్థులకు సూచించారు. విద్యతోనే విద్యార్థుల భవిష్య త్తుకు బలమైన పునాది అన్నారు. గ్రామ సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్ గ్రామంలో విద్యా భివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుని చదువుకు ప్రాధా న్యత ఇస్తుండటం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రగతి కోసం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు సమి ష్టిగా పనిచేయాలని సూ చించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్య సించేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మలికార్జున్, ఎంఈఓ ఎల్లయ్య, ఎంపీడీ వో, సర్పం చ్ దివ్య రవితేజ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పి.డి. మధుసూదన్, సీఆర్పీ రాములు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో దేవాలయాలు





- నియోజకవర్గ వ్యాప్తంగా భక్తి భావం పెంపొందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పలు దేవాలయాలకు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపన

**పటాన్చెరు, జూన్ 18 (సింగిడి):** పటాన్చెరు నియోజకవర్గంలో ఒక వైపు అభివృద్ధి మరో వైపు సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందిస్తున్నారు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక విలువల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తున్నారు. తాజాగా జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో గురువారం ఉదయం శివాలయం, రామాలయం, అమ్మవారి దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం బండల మల్లన్న దేవాలయం ఆవరణలో చౌడమ్మ దేవాల యం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన దేవాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పను లకు సొంత నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలలో ఆధ్యాత్మిక భావం పెంపొందించడంలో భాగంగా పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా కుల మతాలకు అతీతంగా దేవాలయాలు, మసీ దులు, చర్చిలు నిర్మిస్తూ పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబో తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, సుధాకర్, విజయ్, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, నాగమల్లేష్, తదితరులు పాల్గొ న్నారు.

# శ్వేతపత్రం విడుదల చేయాలి లేదా విచారణకు ఆదేశించాలి

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** కరీంనగర్ పట్టణంలోని హోటల్ తారక్‌లో గురువారం రోజున నిర్వ హించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొప్పుల మాట్లాడు తూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్ట ళ్లు, గురుకుల పాఠశాలల విద్యా ర్థులకు అవసరమైన పుస్తకాలు, బూట్లు, టైలు, పాత్రలు తదితర వస్తువుల కొనుగోలుకు పిలిచిన దాదాపు రూ.2,000 కోట్ల టెండ ర్లలో భారీ అవినీతి జరిగిందని ఆరో పించారు.ఈ టెండర్ల ప్రక్రియను ముందుగానే కొందరికి అనుకూలంగా సిద్ధం చేసి నిర్వహించినట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధారాలతో ఆరోపణలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. అవినీతి జరగలేదని ప్రభుత్వం భావిస్తే ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా పదవీ విరమణ చేసి న న్యాయమూర్తితో విచారణ జరిపించి నిజానిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.గతంలో స్థానిక చిన్న పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు టెండర్లలో ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం వాటిని పక్కనబెట్టి ఇతర రాష్ట్రాల పెద్ద సంస్థలకు అవకాశాలు కల్పిస్తు న్నారని ఆరోపించారు. దీంతో తెలం గాణ యువత, స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన 93 రకాల వస్తువుల సరఫరా కోసం పిలిచిన రూ.761 కోట్ల టెండర్లలో మార్కెట్ ధరలకు, కోట్ చేసిన ధరలకు మధ్య దాదాపు రూ.200 కోట్ల వ్యత్యాసం ఉందని పేర్కొ న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమయ్యేలోపే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు తదితర ఏర్పాట్లు పూర్తిచేసే వారని, ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ ను హడావుడిగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. కొంతమందికి లాభం చేకూర్చేలా టెండర్లు కట్టబె ట్టడం వెనుక వందల కోట్ల రూపా యల అక్రమాలు జరిగాయని ఆరో పించారు.గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యా ర్థుల పేరిట అవినీతి జరుగు తోందని, దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని లేదా శాసనసభలో చర్చకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. తప్పు లను ప్రశ్నిస్తున్న వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వా మ్యానికి మంచిది కాదన్నారు.హరీశ్ రావుపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయ డాన్ని తప్పుబట్టిన కొప్పుల ఈశ్వర్, ప్రజా సమస్యలపై అడిగిన ప్రశ్నల కు సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. టెండర్ల వ్యవహా రంలో అవినీతి జరగలేదని నిరూ పించగలిగితే ప్రభుత్వం ముందుకు రావాలని, లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం...

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే:
- కళాశాలలో ఆకస్మిక తనిఖీ.. విద్యా ప్రమాణాలపై రాజీ లేదన్న ఎమ్మెల్యే..:
- గామీణ అభివృద్ధికి మరో అడుగు.. రూ.1 కోట్ల సీసీ రోడ్ల పనులకు శ్రీకారం
- విఠలేశ్వరుని ఆశీస్సులతో ప్రజాసేవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే





**నిర్మల్ ప్రతినిధి, కుభీర్ : జూన్ 18 (సింగిడి):** కుభీర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిర మ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలా లు అందేలా అధికారులు కృషి చేయాలని సూచిం చారు. లబ్ధిదారులు మంజూరు పత్రాలను సద్వినియో గం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.

**ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే..**

కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు, బోధన పరిస్థితులు, మౌలిక వసతులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడి బోధన నాణ్యతపై ఆరా తీశారు. కొంతమంది ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిం చడాన్ని గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా సమయపా లనతో బోధన నిర్వహించాలని ఉపాధ్యాయులకు హెచ్చ రించారు. విద్యా ప్రమాణాల పెంపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.

**ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే...**

ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ గారు కుభీర్ మండలంలోని ప్రసిద్ధ విఠలేశ్వర స్వామి ఆల యాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఆలయ సంప్రదా యాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించేందుకు ప్రభు త్వం సహకరిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి ఆల య అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ నిధులతో రూ.1 కోటి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ.**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు రూ.1 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ముధోల్ ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్లు గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగిస్తాయని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో..

# కమిషనర్ కీలక భూమిక

**మర్యాదపూర్వకంగా సిపిని కలిసిన నరసయ్య**



**జవహర్ నగర్, జూన్ 18 (సింగిడి):** శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను అదుపు చేయడంలో పోకిరిలను అరికట్టడంలో సిపి బాడుగుల సుమతీ కృషి ప్రశంసనీయమని కేసీఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల నరసింహ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రగతి నగర్ కు చెందిన కెసిఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల (కూరగాయల నరసింహ) నరసింహ తదితరులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జవహర్ నగర్ లో పోకిరిల ఆగడాలు వంటి సమస్యలపై సిపి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన సిపి తగిన చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని తెలిపారు. పర్యావరణ పరిరక్షనే ధ్యేయంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభాతవన
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
19-6-2026

## సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**వలిగొండ, జూన్ 17 (సింగిడి):** మండల పరిధిలోని పులిగిల్ల గ్రామం మధిర గోలిగూడెంలో సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని వేదమూర్తి చంద్రశేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి హోమం, శంకు చక్రధారణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించగా, గ్రామ ప్రముఖులు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష, మాజీ సర్పంచులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, జక్క వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు పిన్నింటి ఉమారాణి, కంచి శ్రీధర్ ఆలయ కమిటీ అధ్యక్షులు మన్నెం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం రాంరెడ్డి, సెక్రటరీ బలుగురి మహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కంచి యాదయ్య, పడమటి బుచ్చిరెడ్డి, చీలుకూరు మల్లారెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, పైళ్ళ నర్సిరెడ్డి, కొంతం తిరుమల్ రెడ్డి, కొలను వెంకటరెడ్డి, మన్నెం జోగిరెడ్డి, పులిగిల్ల గ్రామ వార్డు సభ్యులు గోలిగుడెం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కరించలేని అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వం



**కోదాడ,జూన్ 18(సింగిడి):** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బీ ఆర్ఎస్వి నిరసనకు పిలుపునిస్తే తమ పార్టీ నాయకులను అరెస్టు చేయటం అమానుషమని, సమస్యలను పరిష్కరించలేని చేవ చచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అని బి ఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్కే నయం తీవ్ర స్థాయిలో విమర్శించారు గురువారం పోలీసుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు.. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు కూడా ప్రభుత్వం కాలరాస్తుందన్నారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా ఉద్యమం నిర్వహిస్తామన్నారు.. పోలీసుల అరెస్టు చేసిన వారిలో కౌన్సిలర్ చేయమా నరేష్ లలిత భాగ్యమ్మ, శ్రీనివాస్ చలిగంటి వెంకట్, కరీముల్లా బాబా కాసాని మల్లయ్య గౌడ్ అబ్బే అల్వాల వెంకట్ ముఖ్య నాయకులు ఉన్నారు

## సర్‌లో పొరపాట్లు దొర్లనీయొద్దు



**నూతనకల్,జూన్ 18(సింగిడి):** సర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పగడ్బందీగా ఈనెల 25 నుంచి చేపట్టనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను నిర్ణయించిన లక్ష్యం మేరకు విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని... జేసీ హరిసింగ్ గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం సందర్శించారు.ఆయన మాట్లాడుతూ ఓటర్ల గణన,గణ పత్రాల పంపిణీ, ధృవీకరణ విధానాలు,కాలపరిమితులు, బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ)తో సమన్వయం కలిగి ఉండాలన్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్ర మానికి సకాలంలో పూర్తి చేసేందుకు సమన్వయంతో ముందుకుసాగాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈనాటి కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు,మాస్టర్ ట్రైలర్ నాగయ్య,ఎంటిఎస్ఓ సందీప్,బీ ఎల్ఓ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి సింగిడి -జనంతో మాట : ఎమ్మెల్యే



**మిర్యాలగూడ జూన్ 18(సింగిడి):** మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ప్రగతి సింగిడి - జనంతో మాట.. పల్లె బాట నూతన కార్యక్రమంలో భాగంగా మిర్యాల గూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ దామరచర్ల మండలంలోని దిలావర్ పూర్ గ్రామపంచాయతీలో పర్యటించారు. గ్రామ ప్రజల సమస్యల ను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే బుధవారం రాత్రి గ్రామస్థులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలు, అభివృద్ధి అంశాలపై చర్చిం చారు.అనంతరం గ్రామంలోనే పల్లె నిద్ర చేసి ప్రజలతో మమేక మయ్యారు.గురువారం ఉదయం సంబంధిత శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రతి వీధిలో తిరుగుతూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనం తరం గ్రామంలో నిర్మాణం పూర్తయిన 10 ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశం చేసారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సమర్పించిన పలు సమస్యలు, అభ్యర్థ నలను స్వీకరించిన వాటిని అత్యవసరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, జూన్ 18 (సింగిడి):** నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.గురువారం ఆ యన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసు పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించిన అనంతరం హెచ్ఓడీలతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు ఉద యం 10 గంటలలోపు వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను తనకు నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భం గా హాజరు పట్టికను పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల హెచ్ఓడీలను ఆయా విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలు, ప్రత్యేక కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థోపెడిక్, పీడియా ట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల పనితీరును సమీక్షించారు.

# చేనేత సహకార సంఘాల ఎన్నికలకు సిద్ధమైన ఓటరు జాబితా

- సమరానికి సన్నద్ధం మవుతున్న సొసైటీల సభ్యులు
- ఎన్నికల ప్రకటన కోసం ఎదురుచూపులు




**హనుమకొండ, జూన్ 18, (సింగిడి):** చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణలో భాగ ంగా అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. వారం రోజుల్లో ఎన్నికల ప్రకటన వెలబడుతుందన్న ఊహాగానాలకు సంఘ సభ్యులు ఎన్నికల సమరానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. వరంగల్ ,ఖమ్మం జిల్లాల సహకార సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడడంతో హన్మకొండ జిల్లా ఎన్నికల నగార మ్రోగుతుందన్న ముందస్తు చర్యలో భాగంగా సం ఘాల నాయకులు, సభ్యులు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా పోటీ చేసేందుకు ఇప్పటినుండే సన్నాహాలు చేస్తు న్నారు. సొసైటీల సభ్యులు ఎక్కడెక్కడ ఉన్నారనే విష యంపై ఆరా తీస్తూ ఫోన్ల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. 2013 ఫిబ్రవరి నెలలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన పాలకవర్గం 2018 వరకు కొనసాగించారు. మళ్లీ అప్పటినుండి ఎన్నికలు జర గకపోగా సుమారు 8 సంవత్సరాల పాటు ఎన్నికల నిర్వహణకు ఊసే లేకుండా పోయింది. ఫలితంగా సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగిసినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ప్రత్యా మ్నాయంగా పాత పాలకవర్గాలనే కొనసాగించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో 2018 నుండి ప్రతి ఆరు నెలలకు ఒకసారి అదే పాలకవర్గానికి అవకాశం ఇస్తూ 13 సంవత్సరాలుగా కొనసాగిం చారు. ఈ నేపథ్యంలో పదవిలో ఉన్నంత ఆసక్తిని తాత్కాలిక పదవీకాలంలో పాలకవర్గం కొనసాగించ కపోవడంతో సొసైటీలు కాస్త ఆర్థికంగా నష్టపోయా యనే ఆరోపణ కూడా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 18 సొసైటీలకు గాను శాయంపేట, కమలాపూర్ సంఘాలకు మాత్రం డిసెంబర్ నెల నుండి ప్రత్యేక అధికారుల చేతిలోకి వెళ్ళాయి. మిగతా సంఘాలకు మాత్రం పాత కమిటీలనే కొనసాగిస్తూ వస్తున్నారు. 13 సంవత్సరాల సుదీర్ఘ పాలకవర్గాల పాలన అనంతరం ప్రభుత్వం నూతన కమిటీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగానే వరంగల్, ఖమ్మం జిల్లాలకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ హన్మకొండ జిల్లా ఎన్నికల ప్రకటన హోల్డ్ లో పెట్టడం ఆంతర్యం ఏమిటని సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సంబంధించిన అధికారులు ఎన్నికల ప్రకటన విషయంపై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. ముందస్తుగా అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొంటున్నారు. సంఘాలు జిల్లాలో 18 సంఘాలకు 2,897 మంది సభ్యులు ఉన్నారు. అందులో పురుషులు 2047 కాగా స్త్రీలు 850 మంది ఉన్నారు.రూ300లు ఉంటేనే చేనేత సహకార సంఘాల్లో రూ 300 రూపాయల వాటదనం ఉంటేనే సభ్యునిగా గుర్తింపు ఉంటుంది. సంఘాల్లో సభ్యులుగా ఉండి వాటాదనం రూ 300 కట్టినట్లు ఉండాలి.ఇలాంటి సభ్యులను పూర్తిస్థాయి సభ్యులుగా గుర్తిస్తారు. సంఘంలో సభ్యుడుగా ఉండి వాటాదనం లేని పక్షంలో ఇలాంటి సభ్యునికి ఓటు హక్కు మీ అవకాశం లేదు. కొత్తగా సభ్యత్వం తీసుకునే వారికి ఎన్నికల్లో అవకాశం ఉండదని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

**జిల్లాలోని సంఘాలు...**

కమలాపూర్ సంఘంలో పురుషులు 74 మంది స్త్రీలు 170 మంది మొత్తం 444 మళ్లీ సభ్యులు ఉన్నారు. ఎలకతుర్తి మండలం సూరారం సొసైటీలో పురు షుల 106, స్త్రీలు 3 మొత్తం 109, కమలాపురం మండలం మరిపల్లిగూడెం సొసైటీలో పురుషులు 114, స్త్రీలు 28 మొత్తం 142 మంది ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ సొసైటీలో పురుషులు 70, స్త్రీలు 19, మొత్తం 89 మంది, నడికుడా మండలం వెంకటేశ్వర పల్లి సొసైటీలో పురుషులు 27, స్త్రీలు 44 మొత్తం 71, ధర్మసాగర్ మండలం జానకిపురం సొసైటీలో పురుషులు 85 మంది కాగా స్త్రీలు 13 మంది మొత్తం 98 హసన్పర్తి సొసైటీలో పురుషులు 32, స్త్రీలు 16 మొత్తం 48 మంది, పరకాల నాగారం సొసైటీలో పురుషులు 80 మంది స్త్రీలు 29 మొత్తం 109 మంది, పరకాల మండలం ముస్త్యాలపల్లి సొసైటీలో పురుషులు 36 మంది స్త్రీలు 32 మంది మొత్తం 68 మంది సభ్యులు ఉన్నారు. పరకాల మండలం రాయపర్తి సొసైటీలో పురుషుల 62 మంది స్త్రీలు 38 మొత్తం 100 మంది, ఆత్మకూరు మండలం పెంచికలపేట సొసైటీలో పురుషులు 231 స్త్రీలు 88 మంది మొత్తం 319 మంది సభ్యులు కాగా పరకాల సొసైటీలో పురుషులు 75 మంది స్త్రీలు 34 మంది మొత్తం 109 మంది సభ్యులు శాయంపేట మండలం పెద్దకోడపాక సొసైటీలో పురుషులు 145 స్త్రీలు 32 మొత్తం 177 మంది శాయంపేట సొసైటీలో పురుషులు 172 స్త్రీలు 74 మొత్తం 246 మంది పరకాల మండలం చర్లపల్లి సొసైటీలో పురుషులు 98, స్త్రీలు 85 మంది మొత్తం 183 మంది హనుమకొండ జిల్లా వెంకటేశ్వర్ల పల్లి సొసైటీలో పురుషులు 123, స్త్రీలు 10 మొత్తం 133 మంది సభ్యులు ఉన్నారు.

## ఓటు వేయలేదని భూ రిజిస్ట్రేషన్‌లో దళిత మహిళలకు వేధింపులు

వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్న ఘటన



**అమరచింత,, జూన్ 18, (సింగిడి):** సర్పంచ్ ఎన్నికల్లో తనకు ఓటు వేయలేదని ఓ దళిత మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా మాజీ సర్పంచ్ వేధించిన ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలం సింగంపేట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు చిన్నపాగ రుక్కమ్మ తెలిపిన వివరాల ప్రకారం 2007 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘాలలో పనిచే స్తున్న భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు 35 గుంటల భూమి పంపిణీ పథకాన్నిచేపట్టింది. సింగంపేట గ్రామంలో 55 మంది మహిళా సంఘాల్లో పనిచేస్తున్న నిరుపేద వ్యవసాయ కూలీలకు 35 గుంటల చొప్పున గ్రామసభలో తీర్మానం చేసి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో ప్రస్తుత మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మహిళా సంఘం అధ్యక్షురాలిగా ఉన్నారు. 55 మందికి భూమిని పంచేందుకు గ్రామ సభలు తీర్మానం చేసి భూమిని కేటాయించారు. అందులో రుక్కమ్మకు 35 గుంటల భూమి వచ్చింది ఇప్పటివరకు ఆమె ఈ భూమిని వ్యవసాయం చేస్తూ ఉన్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా ఉన్న విజయలక్ష్మి 2013లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసింది. ఆ పోటీలో ఆమె ఓడిపోయింది. తన ఓటమికి రుక్కమ్మ, లక్ష్మీ, రాములమ్మలు కారణమని వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా తాస్కారం చేసుకుంటూ వచ్చింది. 55 మందిలో 52 మందికి ఆమె రిజిస్ట్రేషన్ చేసి భూ పంపిణీ చేసింది. 19 సంవత్సరాలు కావస్తున్న తమకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని బాధితులు మాజీ సర్పంచిని ప్రశ్నించగా తనకు మీరు ఓటు వేయకపోవడం వల్లే ఓడిపోయానని అందుకు కారణం మీరేనని,అందుకే రిజిస్ట్రేషన్ చేయనని స్పష్టం చేసినట్లు బాధితురాలు ఆరోపించింది. పలుమార్లు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని అధికారులు వచ్చి పిలిచినా మాజీ సర్పంచి విజయలక్ష్మి నుండి ఎలాంటి సమాధానము ఉండదని బాధితురాలు ఆరోపించారు. ఇప్పటివరకు తాను కాస్తు ఉన్నానని వ్యవసాయం చేస్తూ రూ, 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి భూమిని చదును చేసుకున్నానని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులు స్పందించి తనకు భూమి రిజిస్ట్రేషన్ చేసి చెందుతూ ముందుకు రావాలని రుక్కమ్మ వేడుకున్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్



**అమరచింత, జూన్ 18 (సింగిడి):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ఐ పిలుపునిచ్చారు.గురువారం అమరచింత మండలకేంద్రం లో మహాసభ లకు సంబందించిన వాల్ పోస్టర్ల ను విడుదల చేశారు. ఈ సందర్భంగా . తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ. జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి యస్. గోపి. రైతు సంఘశీ జిల్లా కోశాధికారి బి. వెంకటేష్. సీఐ టీయూ జిల్లా ఉపాధ్య క్షులు. యస్. రాజు లు మాట్లాడుతు. తెలంగాణ వ్యవసాయకార్మిక సం ఘ రాష్ట్ర 4వ మహాసభ లు ఈ నెల 20.21.22.తేదీలలో మహబూబ్ నగర్ పట్టణశీ జరుగు తాయని.20న జరిగే బహిరంగ సభ కు ముఖ్య అతీతిగా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్. కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని విరభద్రం.. కెవి పిఎస్ రాష్ట్రఅధ్యక్షులు.జాన్ వెస్లీ. అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘశీ. ప్రధాన కార్యదర్శి బి. వెంకట్.శివ దాసన్. ఎంపీ.లు హాజరు అవుతున్నారని తెలిపారు.. మొదటి రోజు 20న మహబూబ్ నగర్ టౌన్ హాల్ నుంచి భారీ ప్రదర్శ.ఎమ్ బి సి కాలేజీ గ్రౌండ్ లొ బహిరంగ సభఉంటుందని తెలిపారు 21.22.తేదీలలో 33జిల్లాల నుంచి 1000మంది ప్రతినిధులు హాజరు అవుతున్నరని అన్నారు .దేశం లొ బిజెపి ఉపాధిని ఎత్తేశే క్రమంలో. కొత్తగా నరేగా చట్టం తెచ్చి కేంద్రం యిచ్చే 90%నిధులను 60%కి తగ్గించారని దింతో రాష్ట్ర ప్రభుత్వాలు 40%భరించలనే కొర్రి పెట్టటడం తొ రానున్న రోజుల్లో ఉపాధి హామీ చట్టం లొ కూలీలకు పనిదినాలు కల్పించడం లొ కేంద్రం విఫలం అవుతుందని విమర్శించారు. కనీసవేతనాలు అమలు చేయాలనీ. రేషన్ షాప్ ల ద్వారా 14రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వ్యకస అమరచింత మండలం అధ్యక్షులు కె. శంకర్. చిన్న విష్ణు. ఎ. నిశాంత్ పాల్గొన్నారు

# సరిహద్దుపై కట్టుదిట్టమైన నిఘా

- గ్రామ పోలీస్ వ్యవస్థ మరింత పటిష్టం
- కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో ఎస్పీ నరసింహా ఐపీఎస్ ఆదేశాలు



**కోదాడ, జూన్ 18 (సింగిడి):** తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ముఖద్వారంగా ఉన్న కోదాడ ప్రాంతంలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర సింహ స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో సమాచార సేకరణను మరింత బలో పేతం చేస్తూ గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను పటిష్టం గా అమలు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీ ల్లో భాగంగా గురువారం కోదా డ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ నరసింహ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయనకు కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ రామకృష్ణా రెడ్డి, రూరల్ ఎస్ఐ గోపాల్ రెడ్డి తో పాటు పోలీస్ సిబ్బంది గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నిర్వహించిన కవాతును పరిశీలించిన ఎస్పీ, వారి యూని ఫాంలు, ఆయుధాలు, ఇతర పోలీస్ సామగ్రిని తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

**పెండింగ్ లేకుండా కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి...**

అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, నేరాల నియంత్రణలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల పరిధిలో నమోదైన కే సులు, దర్యాప్తు పురోగతి, కోర్టు కేసుల రికార్డులను నిశితంగా పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేసులో వృత్తి నైపు ణ్యం, బాధ్యతాయుతమైన దర్యా ప్తు ఉండాలని పేర్కొన్నారు.

**ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి**

స్టేషన్ రిసెప్షన్ సెంటర్ పనితీ రును పరిశీలించిన ఎస్పీ, పోలీ స్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యా దుదారుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూ చించారు. ప్రజలకు సత్వర సేవలు అందించి, పోలీసులపై నమ్మకం పెంచేలా పని చేయాలని సిబ్బందికి నిర్దేశం చేశారు.

**సరిహద్దు ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

కోదాడ ప్రాంతం రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండటంతో అక్రమ రవాణా, నిషేధిత వస్తువుల తరలింపు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ఎప్పటిక ప్పుడు గుర్తిస్తూ నేరాలను ముం దుగానే అరికట్టే విధంగా చర్య లు చేపట్టాలని ఆదేశించారు.

**రౌడీషీటర్లపై నిరంతర నిఘా**

అలవాటుగా నేరాలకు పాల్పడే పాత నేరస్తులు, రౌడీషీటర్ల కార్య కలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వారి కదలికలు, కార్యకలాపాలను క్రమం తప్పకుండా నమో దు చేస్తూ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఉంచాలని చెప్పా రు.గ్రామ పోలీస్ అధికారులదే కీలక బాధ్యత అని నేరాల ని యంత్రణలో గ్రామస్థాయి సమా చార సేకరణ అత్యంత కీలక మని ఎస్పీ నరసింహా పేర్కొ న్నారు. గ్రామ పోలీస్ అధికారి వ్యవస్థను మరింత బలోపేతం చేసి, గ్రామాల్లో జరిగే ప్రతి అంశంపై ముందస్తు సమాచారం సేకరించేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. గ్రామ పో లీసుల అప్రమత్తతతోనే నేరాల నివారణ, శాంతిభద్రతల పరి రక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అన్నారు. అనం తరం స్టేషన్ ఆవరణం లో మొక్కలు నాటారు

## మూతపడిన పాఠశాల పునఃప్రారంభించిన ఎంఈఓ



**కమలాపూర్,జూన్ 18 (సింగిడి)** మండలంలోని పాత ఉప్పల్ గ్రామంలోగల మూత పడిన ప్రభుత్వ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి కె శ్రీదర్ తిరిగి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 2022-23 విద్యా సంవత్సరంలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసి వేశార న్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు గ్రామస్తుల సహకారంతో ఈ విద్యా సంవత్సరం ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతికి సంబంధించిన 11 మంది విద్యార్థులతో పునఃప్రారంభించబడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి పాఠశాలల నిర్వహణ ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి బాలబాలిక నాణ్యమైన విద్యను పొందేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాఠశాల పునఃప్రారంభానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులకు విద్యా అవకాశాలు మరింత మెరుగుపడేలా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.పాఠశాల పునఃప్రారంభం ద్వారా గ్రామ విద్యార్థులకు సమీపంలోనే విద్య అందుబాటులోకి రావడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ర్యాకం శ్రీనివాస్, ఉప సర్పంచ్ బూర్గుల నాగరాజు, వార్డ్ సభ్యులు అంబరకొండ శ్రీనివాస్, సిఆర్పి సుభాష్ , విద్యార్థులు,తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాబ్యాసం



**కమలాపూర్,జూన్ 18 (సింగిడి):** మండల కేంద్రంలోని ఎస్సి కాలనిలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాబ్యాసం చేయించారు.తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్ మంజూరు చేశారు. గురువారం ప్రి ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు.అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షరాబ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె శ్రీదర్ ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, సర్పంచ్ పబ్బు సతీష్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి ఎస్ ఆర్ మల్లిక్, జెడ్ పి హెచ్ ఎస్ బాలుర స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం శివ ప్రసాద్ , మాజీ ఎంపీపీ మాట్ల రమేష్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ పుల్ల వనిత, వార్డ్ సభ్యులు పుల్ల శ్రీనివాస్, జన్ను స్వప్న, పాఠశాల, అంగన్వాడీ ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**మహాదేవపూర్. జూన్ 18 (సింగిడి):** జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహాదేవ పూర్ మండల కేంద్రంలోని 5-3వ అంగన్వాడీ కేంద్రాలలో గుర ువారం అక్షరాభ్యాసం అన్న ప్రాసన శ్రీమంతాలు. అంగన్వాడీ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ రాధికా రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం వాటి ఆరోగ్యం మరియు పోషణకు సంబంధించి వాటి పై అవగాహన కల్పించారు. మూడు నుండి ఆరు సంవత్సరాల వరకు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించి వారి ఆరోగ్యానికి సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ హసీనాబాను అన్నారు. గర్భిణీలకు శ్రీమంతాలు చేయడం హర్షనీయమని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీజ వార్డు సభ్యులు మహమ్మద్ అలీ,గడ్డం స్వామి,రాములు. .అంగన్వాడీ టీచర్ సత్యవాణి,ఆశా వర్కర్లు ఆయాలు. గర్భిణీ లు బాలింతలు,పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, జూన్ 18, (సింగిడి):** ఈ నెల 22వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ, టీపీసీసీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైందని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజా స్వామ్య వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడం, అక్రమాలు చోటుచేసుకోకుండా పర్యవేక్షించడం వంటి అంశాల్లో బీఎల్ఏల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ నెల 22న జరగనున్న అవగాహన సదస్సుకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అన్ని బూత్‌లకు చెందిన బీఎల్ఏలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు. సదస్సులో ఓట్ల సవరణ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, బీఎల్ఏల బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.అలాగే ఈ నెల 25వ తేదీ నుంచి బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపథ్యంలో, బీఎల్ఏలు కూడా వారితో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు కావడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు సక్రమంగా సవరించబడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఏఐసీసీ, టీపీసీసీ నాయకుల పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రతి ఓటు విలువను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని ఎమ్మెల్యే కోరారు.సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ జనరల్ సెక్రటరీలు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ఈ వి శ్రీనివాస్ రావు,టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు,కుచన రవళి,జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ అరూరి సాంబయ్య,మాజీ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
19-6-2026

# ఎడిటోరియల్

Editorial

## విద్యారంగంలో మార్పులు కావాలి !

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమానతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడిని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.



## ప్రేమ కోపం

అమ్మ కోపానికి అలిగిన బిడ్డ..
అన్నం తినమనగానే నవ్వుతూ..
అమ్మ ఒడిన వేగంగా చేరుతాం
అదే కదా అమ్మ కోపం మహత్యం ..
అమ్మ అమృత పేగు బంధంలో...
దాగిన అమితమైన ప్రేమావేశం !

నీ గుండెలోకి దూరి..
భయాన్ని ధైర్యంతో భస్మం చేసి..
ఎంచుకున్న లక్ష్యాల కుప్పని..
బూజు దులిపి తట్టి లేపుదాం
నివురు కప్పిన కసిని..
కృషి ఉప్పెనతో తొలగించి..
లక్ష్య శిఖరాన్ని అధిరోహిద్దాం !

బంధుమిత్రుల మాటలు..
వినడం మానేసి సాగిపో
ఎవరితో పోల్చి చూసుకోవద్దు
నీలాంటి మనిషి మరొకరు లేరు
నీ పక్షాన ఆలోచించే వ్యక్తి..
నీ కన్న మరొకరు లేరని తెలుసుకో
లోకుల వాక్కులు నీటి మీద రాతలు
నీ శపథాలు రేపటి విజయ రహస్యాలు !

నీ ఎదుగుదలను చూసి..
ఎగతాళి చేస్తూ ఏడ్చేటోళ్లు..
నీతో నడిచి కాలు అడ్డుపెట్టేటోళ్లు
మన దారిలో ముళ్ల కంప పెట్టేటోళ్లు..
తన లక్ష్యం మరిచి నీ వెంట పడ్డోళ్లు..
నీ పట్టుదలను పెంచే బద్ధ శత్రువులు..
నీ ఉన్నతికి ఆజ్యం పోసే ఈర్ష్య పరులు..
నీ ఎదుగుదలకు నిచ్చెనగా నిలుస్తారు !

మధుపాలీ
9949700037

## గత వైభవపు ఘన కీర్తి....
# తెలంగాణ సంస్కృతి

*సాంప్రదాయక తెలుగు సంస్కృతి మొగలులు హైదరాబాదును పాలించిన నైజాం ప్రభువుల నుండి వచ్చిన పర్షియన్ సంప్రదాయాల కలయికే తెలంగాణ సంస్కృతి. తెలంగాణలోని జనాభాలో దాదాపు 76% తెలుగు మాట్లాడతారు. 12% ఉర్దూ భాషను 12% ఇతర భాషలను మాట్లాడతారు. 1948 కంటే ముందు హైదరాబాద్ రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషగా ఉండేది. తెలుగు భాష విద్యాసంస్థలు ఉండేది కావు. తెలంగాణలోని విద్యావంతులైన శిష్టజనుల భాషగా ఉర్దూకు ప్రాముఖ్యత ఉంది.*



1948 తర్వాత హైదరాబాద్ సంస్థానం భారత్ రిపబ్లిక్‌లో విలీనమైంది. తెలుగు అధికార భాషగా ఏర్పడింది. పాఠశాలలు కళాశాలలో తెలుగును బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టారు. దీనితో ఉర్దూ భాషను ఉపయోగించే వారి సంఖ్య క్రమేణా తగ్గిపోయింది. మహమ్మద్ కూలీ కుతుబుషా ఉర్దూ భాష యొక్క తొలి సాహెబ్ దివాన్ గా పరిగణిస్తారు. తొలి యుగాల నాటి తెలంగాణ కవులులో కంచర్ల గోపన్న లేదా భక్త రామదాసు గోన బుద్ధారెడ్డి పాల్కురికి సోమనాధుడు మల్లినాథ సూరి కి భాస్కరుడు ప్రసిద్ధులు. ఆధునిక యుగపు వైతాళికులలో కాలోజీ నారాయణరావు, దాశరధి కృష్ణమాచార్యులు, శ్రీ భాష్యం విద్యాసారథి సి. నారాయణరెడ్డి 9వ భారత ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పేర ఎన్నిక గలవారు.



**తెలంగాణ జనాభా:**
కొత్త రాష్ట్రమైన తెలంగాణ రాష్ట్ర భౌగోళిక ప్రాంతం 1, 14,840 చదరపు కిలోమీటర్లు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా3, 51, 93,978. దేశంలోని రాష్ట్రాలలో భౌగోళిక ప్రాంతం జనాభా పరిణామం దృష్ట్యా చూస్తే తెలంగాణ రాష్ట్రం 12వ స్థానాన్ని ఆక్రమిస్తుంది.

**కలలకు కానాచి తెలంగాణ:**
ప్రపంచంలో అతి సున్నితమైన నేతపని రంగులు అద్దడం లాంటి కలలకు తెలంగాణ కాణాచి. వజ్రాల గనుల తర్వాత నూలు ఉత్పత్తికి తెలంగాణ ప్రముఖమైన కేంద్రం.

**మతాలు:**
తెలంగాణ ప్రాంతపు ప్రధాన మతాలు హిందూ మతం ఇస్లామతం ఆరవ శతాబ్దం వరకు బౌద్ధమతం ప్రాబల్యం మతంగా ఉండింది. తెలంగాణ ప్రాంతం మహాయాన బౌద్ధ మతానికి కేంద్రమని నాగార్జున కొండలోని స్మారక కట్టడాలు రుజువు చేస్తున్నాయి. శ్రీ పర్వతంపై నెలకొన్న ప్రపంచ విశ్వవిద్యాలయానికి ఆచార్య నాగార్జునలు అధ్యక్షుడు.

**తెలంగాణ కళారూపాలు:**
కాకతీయుల పాలనా కాలంలో దేవాలయ కళారూపాల చేత స్ఫూర్తి విధి పేరని శివతాండవం లాంటి నాటిక రూపాలు ఏర్పడ్డాయి .నిత్య జీవితపు సవాలను ఎదుర్కొనే ప్రక్రియలో సామాన్య ప్రజానికం ఒగ్గు కథలు గోత్రాల లాంటి కథలు సమస్య పరిష్కార కళారూపాలు రూపొందించారు. తెలంగాణను పాలించిన కుదుభూషాలు నిజాం ప్రభువుల ప్రభావంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో కవ్వాలీలు గజల్లు ముషారాయిలు ముఖ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలుగా ప్రసిద్ధికి ఎక్కాయి.

**తెలంగాణ జాతరలు:**
కళారూపాలతో పాటుగా తెలంగాణలో ఎన్నో ప్రాంతాలలో జాతరలు ప్రసిద్ధి కెక్కాయి. ఈ జాతరలో సమ్మక్క సారక్క అనే గిరిజన మాతా పుత్రికల కథను జీవిత గాధను గుర్తుతెచ్చుకుంటారు. సమ్మక్క సారక్కలు జాతరలే కాక నాగోబా జాతర, కొమురవెల్లి మల్లన్న జాతర, పెద్దగట్టు జాతర, లింగమయ్య జాతర, తదితర జాతరలకు తెలంగాణ ప్రాంతం ప్రసిద్ధి.

**పందిరి. శ్రీనివాసులు:**
**ఎంఏ ( జాగ్రఫీ) బిఈడి, ఎంసీజే (జర్నలిజం), పిజిడిసిజె ( జర్నలిజం)**
**ఉస్మానియా యూనివర్సిటీ**



**తెలంగాణలో పండుగలు:**
తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పండుగలను అధికారిక పండుగలుగా ప్రకటించింది. ఈ విధంగా తెలంగాణ సాంప్రదాయక సంస్కృతిక వైభవాలకు నిలువుటద్దంగా గత వైభవపు ఘన కీర్తికి నిలువుటద్దంగా తెలంగాణ సంస్కృతి నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# గణితశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్

అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటరు. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమిటి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిస్కరించి తెరమీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్ .

పాస్కల్ (జూన్ 19, 1623 – ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కనిపెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త. బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ – మధ్య ప్రాంతంలో ఆవర్న్ ప్రాంతంలో క్లెర్మాంట్‌లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి.

ఫ్రాన్స్ కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజంలోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు.దీంతో ఈయన తండ్రి పాస్కల్‌ను గణితం చదవ దానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల (ఎశీఅఱష ంవష్ఱశీఅం) గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది.

శంఖు పరిచ్ఛేదంలో అంతర్లిఖితమైన ఏదైనా షడ్భుజి యొక్క అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులూ కలిసే మూడు ఖండన బిందువులూ ఒకే సరళరేఖలో ఉంటాయి.

ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటోది, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2–5,3–6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు.



ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిసీ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసుల ఓ పుస్తకం రాశాడు.

పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూచి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసిపెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరగ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు.

పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని పైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు.

1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు. 1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు.

*పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా. రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాసాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ -- అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనంపై ప్రయోగాలు.*

1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించ బడుతుంది.

1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

## సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు
## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్




**కరీంనగర్,జూన్18(సింగిడి):** ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

■ సీపీ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, జూన్ 18(సింగిడి):**
నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్‌ను నేపథ్యంలో మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గారితో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఇతర పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సిపి మాట్లాడుతూ ... పరీక్షను ప్రశాంతంగా, పారదర్శ కంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలపై చర్చించి ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. పరీక్షకు అధిక సంఖ్యలో మహిళా అభ్య ర్థులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, బందోబస్తు విధుల్లో మహిళా పోలీసు సిబ్బంది, మహిళా హోంగా ర్డులను ఎక్కువ సంఖ్యలో నియమించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రశ్నాపత్రాల రవాణా,



భద్రపరిచడం, సమాధాన పత్రాలను సురక్షితంగా తిరిగి డిపాజిట్ చేయడం వంటి ప్రక్రియలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. నీట్ రీ-ఎగ్జామినేషన్‌ను పూర్తిస్థాయిలో సురక్షితంగా, ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయంగా పనిచేస్తారని సీపీ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. గతంలో ప్రశ్నాపత్రం లీకేజీ ఘటన కారణంగా ఈ రీ-ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో మొత్తం 1,204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా, వారి కోసం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోని ప్రతి గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా, పర్యవేక్షణ చర్యలు చేపట్టినట్లు వెల్లడిం చారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియ లను నిర్దేశిత నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిం చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించి నట్లే, ఈసారి కూడా పోలీసు శాఖ, పరీక్ష నిర్వహణ సంస్థ, విద్యాసంస్థల సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాలో నీట్ రీ-ఎగ్జామినేషన్‌ను ప్రశాం తంగా, పార దర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ పాల్గొన్నారు.

## నకిలీ పత్తి ప్యాకెట్లు సీజ్



**నూతనకల్, జూన్ 18 (సింగిడి):**
మండల పరిధిలోని పెద్దనెమిల ఎక్స్ రోడ్ వద్ద నకిలీ పత్తి విత్తనాల రవాణా జరుగుతుందనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు,వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం రాత్రి సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అనుమానస్పందంగా వెళ్తున్న హీరో గ్లామర్ బైక్ ఋా-29-5651 మహబూబాబాద్ జిల్లా,గుండె పూరి గ్రామం,మరిపెడ మండలం బోడపట్ల యాకస్వామి (32) ఆపి తనిఖీ చేయగా అరుణోదయ లేబుల్ కలిగిన 65 ప్యాకెట్లు నకిలీ విత్తనాల వ్యాపారంతో అమాయక రైతులను మోసం చేసే ప్రయత్నాలను అరికట్టేందుకు పోలీసులు,వ్యవసాయ శాఖ సంయుక్త చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకో వడంతో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బం దిని,ఎస్పీ నర్సింహ ప్రత్యేకంగా అభినందించారు.

## ఉన్నత పాఠశాలలో 5 సీసీ కెమెరాలు ఏర్పాటు

- పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం
- సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్



**మునుగోడు, జూన్ 18 (సింగిడి):**
పూర్వ విద్యార్థుల సేవలు అభినందనియమని మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ అన్నారు. మునుగోడు మండల కేంద్రంలోని, మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 సీసీ కెమెరాలు 2001- 2002 పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేయడం జరిగింది అట్టి సీసీ కెమెరాలను సర్పంచ్, మండల అధికారులు, మరియు పోలీస్ శాఖ కలసి ప్రారంభించారు. హెడ్ మాస్టర్ బాల ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. సర్పంచ్ పాలకూరి రమాదేవి, ఎంపిడిఓ విజయభాస్కర్, ఎంఈవో మల్లేశం, ఏఎస్సై హబివుద్దీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి లతో కలిసి విద్యార్థులు, పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు సిసి కెమెరా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల సెక్యూరిటీ తో సమానమని అన్నారు. చదువుకున్న పాఠశాలలో పాఠశాల అభివృద్ధికై మేమున్నామంటూ 2001 ,2002 సంవత్సరం పూర్వ విద్యా ర్థులు ముందుకు రావడం, పాఠశాల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినదనీయమని అన్నారు సర్పంచ్ రమాదేవి..పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, మన ఊరు మనబడి మనం చదువుకున్న పాఠశాలకు ఎంత చేసిన తక్కువేనని, ఎంతో కొంత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే మేము ముందడుగు వేశామన్నారు. మేము చదువుకున్న పాఠశాల అభివృ ద్ధికి మా వంతు సహాయ సహకా రాలు అందిస్తామని హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినం దించారు. కార్యక్రమంలో, ఉపాధ్యా యులు కునూరెడ్డి సత్తిరెడ్డి, రత్న య్య, అన్నపురెడ్డి, మహిళ ఉపాధ్యాయు లు, పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్, బొల్లు సైదులు, భవిత పాఠశాల చైర్మన్ పందుల ఎల్లమ్మ, గాలి సైదులు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ళ ప్రణ య్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ చేసిన రైతులకే యూరియా: డీఏఓ శ్రీధర్ రెడ్డి



**పాలకవీడు, జూన్ 18 (సింగిడి):**
సూర్యాపేట జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి గురువారం పాలకవీడు మండలంలోని జానపహాడ్, పాలకవీడు గ్రామాల ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ ప్రారంభమైందని, ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్న రైతులకే యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో సంబంధిత దుకాణం లేదా సొసైటీలో ఎరువులు పొందాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని స్పష్టం చేశారు.

## గంజాయి, మత్తు పదార్థాలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

-చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు
-జీడీకే టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు



**యైటింక్లయిన్ కాలనీ, (సింగిడి):**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలన కు చేపడుతున్న చర్యల్లో భాగంగా గోదావరిఖని టూ టౌన్ పోలీసులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వ హించారు. రామగుండం పోలీస్ కమిషనర్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షిర్కే, తెలంగాణ చౌరస్తా, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు వివిధ కూడళ్లలో ఉన్న షాపులను నార్కోటిక్ డాగ్ తో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసినా లేదా నిల్వ ఉంచినా సంబంధిత షాపు యజమానులు, వ్యక్తులపై నార్కోటిక్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకు ని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమాజంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరా రు. ఈ తనిఖీల కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండి అహ్మదుల్లా, హెడ్ కానిస్టేబుల్ ఎండి యాకూబ్, జి. రాజేందర్, ప్రదీప్ రెడ్డి, సాయిచంద్, దేవేందర్, నార్కోటిక్ హెడ్ కానిస్టేబుల్ ఎన్. అంజయ్యతో పాటు డాగ్ హ్యాండ్లర్లు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం మండల కన్వీనర్‌గా మహేష్



**సుల్తానాబాద్, (సింగిడి):**
తెలంగాణ మున్నూరు కాపు సంఘం మండల క న్వీనర్ గా సుల్తానా బాద్ మండల కేంద్రాని కి చెం దిన గొట్టం మ హేష్ నియమిస్తూ, ని యామక పత్రాన్ని కన్వీ నర్ పెంట రాజేష్ అందజేసి శుభాకాంక్ష లు తెలిపారు. మండల స్థాయిలో సంఘ కార్యక్ర మాలను మరింత విస్తృతంగా నిర్వహించ డంతో పాటు మున్నూరు కాపు సామాజిక వర్గ ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన మండల కన్వీనర్ గొట్టం మహేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బా ధ్యతలు అప్పగించిన రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

-బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నం నారాయణ

**నిర్మల్ ప్రతినిధి, జూన్ 18 (సింగిడి):**
ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో ప్రవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఆర్థిక దోపిడి కి పాల్పడుతున్నా యని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నం నారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లాలో ప్రవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిబంధనలను అతిక్రమించి ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో పుస్తకాలు వర్క్ బుక్కులు స్టడీ మెటీరియల్ పేరుతో పిల్లల తల్లిదండ్రుల నుండి అక్రమంగా డబ్బు లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని స్కూళ్లలో అనుమతి లేకుండా నిర్వహించబడుతూ నవోదయ సైనిక్ ఇతర శిక్షణల పేరుతో మోసం చేసి పేద మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని తెలిపారు. జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహించబడుతున్న ప్రైవేటు పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే చర్యలు తీసుకోవా లన్నారు. నిబంధనలను అతిక్రమించి పాఠశాలలో పుస్తకాలు వర్క్ బుక్కులు అమ్మితే



అటువంటి పాఠశాలల ముందు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామ న్నారు. కొన్ని పాఠశాలలో స్కూల్ బస్సులు ఫిట్నెస్ లేకుండా నడుపు తున్నారని ప్రమాదాలు జరిగితే ఎవ రూ బాధ్యులని ఆయన ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థలు కార్పొరేట్ సంస్థల్లో అర్హత లేని ఉపాధ్యాయులను నియమించు కొని విద్యా బోధన చేస్తున్నారన్నారు. ఐఐటి ఇతర కోర్సుల పేరుతో ఫీజు లు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశా ల దానికి సంబంధించిన లెక్చరర్లను నియమించుకోకుండా ఉన్న సిబ్బందితో సర్దుబాటు చేస్తున్నారని ఇది నిబంధనలకు అతిక్ర మించడమేనని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలు అధిక ఫీజులపై బీసీ సంక్షేమ సంఘం త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాల యం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి నిబంధనలను అక్రమించిన విద్యాసంస్థలపై వెంటనే చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి. కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ ప్రతినిధి, జూన్ 18 (సింగిడి):**
బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించా లని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి



స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట

సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు

**చింతపల్లి, జూన్ 18(సింగిడి) :** విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట వేసినందున విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని గడియ గౌరారం గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు అన్నారు. మండలంలోని ఘడియ గౌరారం గ్రామంలోని జడ్‌పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, స్కాలర్‌షిప్ సౌకర్యాలు, ఉచిత మధ్యాహ్న భోజన పథకాలను వినియోగించుకొని విద్యలో రాణించాలని అన్నారు. విద్యార్థులు




కష్టపడి చదివి ఐఐఐటీ బాసర వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందాలని, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యా యులు బి. వెంకటేశం, సీనియర్ ఉపాధ్యాయులు వాణి కుమారి, భాగ్యలక్ష్మి, కృష్ణారెడ్డి, హేమ, వెంకటే శ్వర్లు, సుమలత, సువర్ణ, కృష్ణయ్య, పద్మ, అన్నపూర్ణ, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

## యోగ డేని విజయవంతం చేయండి

కలెక్టర్ చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి జూన్ 18( సింగిడి ) :**
21న యోగా డే లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఔట్డోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 6 గంటలకు జరిగే యోగా డే పోస్టర్లు ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ యోగా డేలో అధికారులతో పాటు యోగ క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని సామూహిక యోగా కార్యక్రమం లో పాల్గొన లని, యోగ డే ని పండుగ వాతావరణంల నిర్వహించాలని అన్నారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడ అధికారి అక్బర్ అలీ, ఆయుష్ డాక్టర్లు బుష్రా రుచిత, డిపిఎం కళ్యాణ్, యోగా గురువులు శ్యాంసుందర్, కరుణాకర్, రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్ కుమార్, శివ, మంజునాథ్, జ్యోతి, బజరంగ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

- ప్రతీ ఒక్కరూ రక్షణ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలి
- అర్జీ-3 జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్
- ఓసీపీ-1లో 12టన్నుల కెపాసిటీ గల ఐదు క్రేన్స్ ప్రారంభం



**యైటింక్లయిన్ కాలనీ, జూన్ 18, (సింగిడి):**
యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో యంత్ర సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సింగరేణి సంస్థ రామగుండం రీజియన్-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఓసీపీ-1 బేస్ వర్క్‌షాప్‌లో 12 టన్నుల సామర్థ్యం గల ఐదు నూతన హైడ్రాలిక్ క్రేన్ల ప్రారంభానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి సాధనకు ఉపకరించేందుకు యాజమాన్యం కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేస్తున్న భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. యంత్రాల వినియోగంతో పాటు నిర్వహణను సైతం ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించాలని సూచించారు. యంత్రాల వినియోగ సమయంలో నిర్దేశించిన భద్రతా నిబంధనలు, రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనలో యంత్రాల పనితీరు అత్యంత కీలకమని, వాటి సమర్థ వినియోగం ద్వారా ఉత్పాదకతను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. నూతన హైడ్రాలిక్ క్రేన్లు అందుబాటులోకి రావడంతో నిర్వహణ, మరమ్మతు పనులు వేగవంతం కావడంతో పాటు గనుల కార్యకలాపాల సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం ఎం. రామ్ మోహన్, ఏరియా ఇంజనీర్ అత్మూరి ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి. ఫాటింగ్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎం. రామచంద్ర రెడ్డి, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి,జక్కుల దామోదర్ రావు, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్‌తో పాటు వివిధ యూనియన్ల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం

- హాజరైన గర్రెపల్లి సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్
- పిల్లలకు యూని ఫామ్స్ విద్యాసామాగ్రి పంపిణీ



**సుల్తానాబాద్, జూన్ 18(సింగిడి):**
సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలోని గొల్ల వాడ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఆధ్వ ర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్య క్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ హాజర య్యారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్,ఉపా ధ్యాయు లకు కలిసి చిన్నారులకు అక్షరా భ్యాసం చేయించిన అనంతరం వారికి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, కంపాస్ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అలాగే అంగ న్వాడీ పిల్లలకు యూనిఫామ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ తో పాటు ఉపసర్పంచ్ నవీన్, పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు జె. వాణి, ఉపాధ్యాయులు ఆర్. ఓదయ్య, అంగ న్వాడీ సూపర్వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్ డి. స్వర్ణలత, అంగన్‌వాడీ ఆ యా, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొ న్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఐత రాజ్‌పల్లి సర్పంచ్ దీకొండ భూమేష్‌కుమార్
- 150 మందికి వైద్య సేవలు.. బీపీ, షుగర్, గుండె పరీక్షలు



**సుల్తానాబాద్, జూన్ 18(సింగిడి):**
సుల్తానాబాద్ మండలం ఐత రాజ్ పల్లిగ్రామంలో సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మెడి కవర్ ఆసుపత్రి సౌజన్యంతో ని ర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్ర జలు తరలి వచ్చి, 150 మందికి పైగా రక్తపోటు (బీపీ), మధు మేహం (షుగర్), గుండె సంబంధిత వ్యాధులతో పాటుఇతర ఆరోగ్యసమస్యలకు సం బంధించిన పరీక్షలు నిర్వహించుకున్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షిం చిన వైద్యులువారి ఆరోగ్య పరిస్థితులకు అనుగు ణంగా తగిన వైద్య సలహాలు అందించారు. మం దులు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేని పేదకు టుంబాలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దీకొండ భూమేష్ కు మార్ మాట్లా డుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ హాస్పి టల్ యజ మాన్యానికి, డాక్టర్ లోకేష్, మేనేజ్మెంట్ గుర్రం కన కరాజు, హరీష్ రఘు తో పాటు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, పాలకమండలి సభ్యు లు న్యాతరి అరవింద్, సెక్రటరీ భాస్కర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని పాటించాలి : వట్టే జానయ్య యాదవ్



**సూర్యాపేట జూన్ 18 (సింగిడి) :**
ప్రైవేట్ పాఠశాలలు విద్య హక్కు చట్టాన్ని పాటించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఆర్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైట్ టు ఎడ్యుకేషన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చినప్పటికీ రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో పాటించకపోవడం దురదృష్టకరమని అన్నారు . సూర్యాపేటలో సుమారు 75 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై అధిక భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజు వసూళ్లపై తాము పోరాడుతామని అన్నారు. జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, మహిళా అధ్యక్షురాలు మంజుల, కుంభం నాగరాజు ,కవిత, శోభన్, కోలా కరుణాకర్ ,సైదులు, పాల్గొన్నారు.

## నేడు పెద్దపల్లిలో కవిత పర్యటన

**పెద్దపల్లి రూరల్,జూన్ 18(సింగిడి):**
తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,జెండా పం డుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి నియోజకవర్గంలో విస్తృ తంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు టీఆర్ ఎస్ శ్రేణులు,తెలంగాణ ఉద్యమకారులు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పార్టీ జిల్లా ఇంఛార్జీ సలేంద్ర కొమరయ్య యాదవ్ పిలుపుని చ్చారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకు మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. తదుపరి స్థానిక వ్యాపారులను ప్రోత్సహించే ఉద్దేశంతో మిలాన్ స్వీట్ హౌస్‌ను సందర్శించి స్వీట్లు కొనుగోలు చేయడంతో పాటు వ్యాపారులతో మమేకమ వుతారని వివరించారు. అనంతరం జెండా చౌరస్తాలో టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రసంగిస్తారని తెలిపారు. అక్కడి నుంచి పెద్దకాల్వ బస్టాండ్ చౌరస్తాకు చేరుకుని మరోసారి పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ధూళికట్టకు బయలుదేరుతారని చెప్పారు. జెండా పండుగ' కార్యక్రమానికి ప్రజలు,పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని సలేంద్ర కొమరయ్య యాదవ్ కోరారు.

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
19-6-2026

# సమిష్టి కృషితోనే.. మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం

## 26న యాంటీ డ్రగ్స్ 3కే రన్ : ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి,జూన్ 18 (సింగిడి):** మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును, సమాజ శ్రేయస్సును తీవ్రంగా దెబ్బతీస్తున్న దని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్స్ 3కే రన్" పోస్టర్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ ఎస్పీ మాట్లాడుతు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అనేది ఒక్క శాఖ లేదా సంస్థబాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి కృషితోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుం దన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని, ఈ దిశగా ఐఎంఏ జగిత్యాల చేపడు తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో యాంటీ డ్రగ్స్ 3కే రన్‌లో పాల్గొని మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి



తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ యాంటీ డ్రగ్స్ 3కే రన్ యువతలో ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పించడం తో పాటు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన పెంపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, డా. గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చింతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దొరల మెప్పుకోసమే కొప్పుల, ప్రవీణ్ కుమార్ విమర్శలు

### సంక్షేమ శాఖలో అవినీతి ఆరోపణలు నిరాధారం
### బీఆర్ఎస్ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు మెప్పు పొందేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆ పార్టీ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తనపై అనవసర విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ అవమానానికి గురైనప్పుడు తాను సాటి దళితు డిగా అండగా నిలిచానని గుర్తు చేశారు. గురువారం రోజున కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గతంలో సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్, గురుకులాల కార్యదర్శిగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పనిచేసినప్పటికీ, ఏడాది కాలంగా శాఖ పనితీరుపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. సంక్షేమ శాఖలో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీశ్‌రావు ఆరోపణలను ఖండించిన మంత్రి, విద్యార్థులకు అవసరమైన వస్తువుల కొనుగోలుకు రూ.683 కోట్లతో, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మరో రూ.500 కోట్లతో నిబంధనల ప్రకారం టెండర్లు ఖరారు చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.1,183 కోట్ల విలువైన ప్రక్రియను వక్రీకరించి అవినీతి ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిలో కొప్పుల ఈశ్వర్ విఫలమయ్యారని, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, ఆర్టీసీ బస్సు డిపో వంటి కీలక సదుపాయాలు



తీసుకురాలేకపోయారని విమర్శించారు. అందుకే 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆయనను తిరస్కరించారని పేర్కొన్నారు. దోచుకోవడం, దాచుకోవడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటుగా మారిందని ఆరోపించిన మంత్రి, గతంలో సంక్షేమ శాఖలో పనిచేసిన కొప్పుల ఈశ్వర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తమ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. అలాగే, వడ్ల కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సీజన్లలో చేపట్టిన వడ్ల కొనుగోళ్లపై తన పాత్ర ఏమిటో ప్రజలకు వివరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ ,ముక్క భాస్కర్, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ సాంస్కృతిక ప్రతిభా స్కాలర్‌షిప్‌కు

# పారమిత విద్యార్థి ఎంపిక

### దక్షిణ భారతదేశం నుంచి నలుగురిలో ఒకరిగా, తెలంగాణ నుంచి ఏకైక విద్యార్థిగా కిట్ల చరణ్ ఘనత



**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని సాంస్కృతిక వనరులు , శిక్షణ కేంద్రం (సీసీఆర్‌టీఈ) నిర్వహిం చిన సాంస్కృతిక ప్రతిభా అన్వేషణ స్కాలర్‌షిప్ పథకం–2025--26కు కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ ఎంపికై నట్లు పాఠశాల డైరెక్టర్ రష్మిత తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు దక్షిణ భారతదేశం నుంచి కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా చరణ్ గుర్తింపు పొందాడు. ఈ ఎంపికతో చరణ్‌కు పట్టభద్ర విద్య పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ అందనుంది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి విద్యార్థికి రూ.3,500, శిక్షణ అందించిన సంగీత ఉపాధ్యాయుడికి రూ.9,000 చొప్పున మొత్తం రూ.12,500 మంజూరు కానుండగా, ఈ మొత్తం ప్రతి ఏడాది పెరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలతో పాటు రాష్ట్రానికి కీర్తి తీసుకొచ్చిన చరణ్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, వినోద్ రావు, వి.యు.ఎమ్. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యా యుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, సంగీత ఉపాధ్యాయుడు జితుమణి శర్మ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### టీటీడీ ఆలయ నిర్మాణానికి

# ప్రత్యేక చొరవ చూపాలి

### ఉత్తర తెలంగాణ భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధిపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుతో వెలిచాల రాజేందర్‌రావు చర్చ

**కరీంనగర్, జూన్ 18(సింగిడి ):** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు బుధవారం హైదరాబాద్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో నిర్మాణంలో ఉన్న టీటీడీ ఆలయం అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. ఆలయాన్ని ఉత్తర తెలంగాణ ప్రాంత భక్తులకు మరింత చేరువయ్యేలా దేదీప్యమానంగా నిర్మించాలని రాజేందర్‌రావు కోరారు. ఆలయ ప్రాంగణ అభివృద్ధి, పార్కింగ్ విస్తరణ, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలను ఆయన టీటీడీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణం, అభివృద్ధికి అవసరమైన చర్యలపై సానుకూలంగా స్పందించిన బీఆర్ నాయుడు, టీటీడీ తరఫున ప్రత్యేక చొరవతో ముందుకు



సాగుతామని హామీ ఇచ్చినట్లు రాజేందర్‌రావు తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ టీటీడీ ఆలయం ఉత్తర తెలంగాణలో ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రాజేందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశానికే ఆదర్శంగా నిలిచిన ధర్మరాజు పల్లి సంఘం

### కేడీసీసీ జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్ రావు
### ఘనంగా రజతోత్సవ వేడుకలు

**జమ్మికుంట, జూన్ 18 (సింగిడి):** రైతుల ప్రయోజనాల కోసం ఏర్పడ్డ ధర్మరాజు పల్లి ధాన్య విత్తన రైతు పరస్పర సహాయ సహకార పరపతి సంఘం దేశానికి ఆదర్శంగా నిలిచిందని సహకార ఉద్యమానికి ఊపిరి పోసిందని కే డి సి సి మాజీ అధ్యక్షులు కొండూరి రవీందర్రావు అన్నారు. గురువారం హుజూరాబాద్ మండలం ధర్మరాజు పల్లి గ్రామంలో ధర్మరాజు పల్లి దాన్య విత్తన రైతు పరస్పర సహాయ సహకార పరపతి సంఘం రజితోత్సవ వేడుకల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... 1999లో 150 మంది రైతులతో ఏర్పడ్డ ఈ సంఘం దినదినం అభివృద్ధి చెందుతూ 25 సంవత్సరాల లో రాష్ట్రంతో పాటు దేశంలోనే ఉత్తమ రైతు సహకార సంఘం గా ఏర్పడిందన్నారు. వరంగల్ సహా వికాస సంస్థ ప్రోత్సాహంతో ముల్కనూరు గ్రామీణ బ్యాంకు సూచనల మేరకు ఈ సంఘం తన కార్యకలాపాలను కొనసాగిస్తూ రైతుల



ప్రయోజనాల కోసమే పాటుపడిందన్నారు. రైతులే యజమానులుగా సభ్యులుగా ఏర్పడ్డ ఈ సంఘం ప్రస్తుతం మూడు గోదాములు నిర్మించి రైతుల వద్ద విత్తనాలను కొనుగోలు చేస్తున్నారన్నారు. డీలర్ల ద్వారా కరీంనగర్ వరంగల్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ ఖమ్మం నల్గొండ మహబూబ్నగర్ తూర్పుగోదావరి పశ్చిమగోదావరి కృష్ణా గుంటూరు విజయనగరం అనంతపూర్ తో పాటు కర్ణాటక ప్రాంతాలకు విత్తనాలను పంపిస్తుందన్నారు. ఒక గ్రామంలో రైతుల ప్రయోజనాల కోసం ఏర్పడ్డ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయం అని దీని వెనుక ప్రతి ఒక్క రైతు కృషి దాగి ఉందని అభినందించారు. ఈ



సందర్భంగా 25 సంవత్సరాల లోగో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ముల్కనూరు కో-ఆపరేటివ్ సంఘ అధ్యక్షులు అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి జిల్లా సహకార అధికారి ఎస్ రామానుజాచార్య సునీత జనరల్ మేనేజర్ వి ఎస్ రాజు సంఘ అధ్యక్షులు బొనగాని శ్రీనివాస్ గౌడ్ సెంట్రల్ మేనేజర్ మూగల రమణారెడ్డి సహా వికాస అధ్యక్షురాలు కాసర్ల జయప్రద ఏవో భూమిరెడ్డి సింగిల్ బెండు అధ్యక్షులు ఎడవల్లి కొండల్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనిల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనమే ప్రగతికి పునాది

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి
### వన మహోత్సవంలో మంత్రి అడ్లూరి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ పిలుపు

**ధర్మపురి, జూన్ 18 ( సింగిడి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి సమతుల్యతను కాపాడాలంటే మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటే సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, రైతులకు మెరుగైన దిగుబడులు లభిస్తాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పు





లు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ అసమతుల్యతే ప్రధాన కారణమని అన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క ను నాటి దానిని సంరక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమం తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప పర్యావరణ ఉద్యమంగా మారిందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే హరిత తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ , ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డీర్ పార్క్‌లో వన మహోత్సవం 2026 ఘన ఆరంభం

### మొక్కల నాటిన మేయర్, ఉప మేయర్, జిల్లా ఉన్నతాధికారులు



**కరీంనగర్, జూన్ 18 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని డీర్ పార్క్‌లో గురువారం వన మహోత్సవం--2026 కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్, ఉప మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ అశ్విని వంకడే, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, నగర ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కార్మికుల రిలే నిరాహార దీక్షకు మున్సిపల్ చైర్మన్ మద్దతు




**జమ్మికుంట, జూన్ 18 (సింగిడి):** మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలకు మద్దతు తెలిపిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ , వర్కర్స్ యూనియన్ ఆదేశానుసారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొలుగురి తిరుపతి, శ్రీనివాస్, రాసపల్లి సంజీవ్, మరేపల్లి ప్రశాంత్ తదితరులు చేస్తున్న రిలే దీక్షలకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వారి న్యాయమైన డిమాండ్ల కోసం తమ సంపూర్ణ తెలుపుతున్నట్లు చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. వారు కోరినట్లుగా మున్సిపాలిటిలో పనిచేసే ఔటో సోర్సింగ్ ఎన్ఎమ్ ఆర్ పిక్స్ పే కార్మికులను పర్మినెంట్,2వ పిఆర్సి ప్రకటించి కనీస వేతనం 26వేలు నిర్ణయించి కేటగిరి వేతనాలు అమలు చేయాలి మున్సిపాల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా డబుల్ బెడ్రూమ్స్, ఇందిరమ్మ ఇల్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి మున్సిపాల్ కార్మికులకు మరణిస్తే దహనం ఖర్చులకు 30వేలు ఇవ్వాలి మున్సిపాల్ కార్మికులకు ఒక్కపూట 8గంటల పని విధానం అమలు చేయాలి. ప్రతి సంవత్సరం మున్సిపాల్లో పనిచేసే శానిటేషన్, వాటర్ వర్క్స్ హరితహారం, ఎలక్ట్రిషన్, డ్రైవర్లకు రక్షణ పరికరాలు అందజేయాలి. మున్సిపాల్ పరిధిలో పనిచేసే డ్రైవర్లకు, జవాన్లకు మిగతా వారి వలె డ్రైవర్స్ కేటగిరి వేతనం ఇవ్వాలి అని తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తా మని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ కొలుగురిసురేష్, ఫిరోజ్,మంద రాజేష్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేర్చాలి

### మానకొండూరులో 'జనకల్యాణ్'లో ఓబీసీ మోర్చా నాయకుల పిలుపు
### ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు

**కరీంనగర్ , జూన్ 18(సింగిడి):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా సమన్వయకర్త ఆకుల రాజేందర్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనకు 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న 'జనకల్యాణ్' కార్యక్రమంలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన వృత్తి కళాకారులు, ఓబీసీ వర్గాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకం మైన పథకమని పేర్కొంటూ, అర్హులందరికీ దాని ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వారు తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ,ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలని, రాబోయే పక్షం రోజుల పాటు విస్తృత స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమా లు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం వల్ల



రైతులకు కలిగే ప్రయోజ నాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ బాధ్యుడు మియాపూర్ లక్ష్మాచారి, మండల సమన్వయకర్తలు గోరిశెట్టి రమేష్, అంబటి స్వామి, వెంగల ప్రవీణ్, నెట్టు అంజయ్యతో పాటు పలువురు భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

### రెండు ఇసుక డంపులు సీజ్, 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక స్వాధీనం, అక్రమ మాఫియాపై కఠిన చర్యలు : కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవా ణా, నిల్వలను అరికట్టేందుకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొత్తపల్లి మండలంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. కాజీపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు భారీ ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. వాటిలో సుమారు 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను తదుపరి చట్టపరమైన చర్యల కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడు తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా వంటి అక్రమ కార్యకలా పాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై గనుల చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పవన్ రూపంలో తెలంగాణలోకి బీజేపీ పాగా..

### తెలంగాణ అస్తిత్వం, సంస్కృతిపై కుట్రలను ప్రజలు గుర్తించాలని పిలుపు
### మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తామని హామీ: టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** కరీంనగర్‌లో నిర్వహించిన 'తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు సాధన' చర్చావేదిక ముగింపు సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ, తెలంగాణలో పాగా వేయడానికి బీజేపీ వివిధ రూపాల్లో ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ వెనుక బీజేపీ హస్తం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. నేరుగా పోటీ చేస్తే ఆశించిన ఫలితాలు రావని భావించి, ఆయనను ముందుకు తెస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు సినిమా నటులను వినోదానికి మాత్రమే పరిమితం చేయాలని, రాజకీయ నాయకులుగా చూడవద్దని యువతకు సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అస్తిత్వాన్ని దెబ్బతీయాలనే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి ముప్పు వాటిల్లితే తెలంగాణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ గ్రామదేవతల ఆరాధన వంటి స్థానిక సంప్రదాయాలకు భంగం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవాన్ని ఆరాధించే స్వేచ్ఛ ఉన్న సంస్కృతిని కాపాడుకోవాల్సిన



అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్‌లో కోటరీ రాజకీయాలకు స్థానం ఉండదని స్పష్టం చేసిన కవిత, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందిస్తామని చెప్పారు. ఉద్యమంలో పనిచేసిన వారికి సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ఖర్చులు తగ్గించే రాజకీయాల అవసరాన్ని ప్రస్తావిస్తూ, బీసీలు, ఎస్సీలు సాధారణ స్థానాల్లోనూ పోటీ చేసే పరిస్థితి రావాలని అభిప్రాయపడ్డారు. మహిళలకు తమ పార్టీ నుంచి 33 శాతం టికెట్లు కేటాయిస్తామనీ, భవిష్యత్తులో దానిని 50 శాతానికి పెంచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఉచిత విద్య, వైద్యం అంశాలపై సమగ్ర అధ్యయనం అనంతరమే తమ పార్టీ హామీలు ప్రకటించిందని చెప్పారు. మేధావులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉద్యమకారులు సహా అన్ని వర్గాల భాగస్వామ్యంతో ప్రజాకేంద్రిత రాజకీయాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చర్చావేదికలో ఆరు తీర్మానాలు ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలి, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగించాలి, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి, తెలంగాణ ద్రోహులను సమర్థించే వారిని వ్యతిరేకించాలి, కరీంనగర్ జాలిగుట్టలో ఉద్యమకారులకు 250 గజాల చొప్పున స్థల పట్టాలు ఇవ్వాలి, అలాగే కరీంనగర్ పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్

# సైబర్ నేరాలపై అవగాహన పెంపే లక్ష్యం

### 20న కరీంనగర్‌లో ఉచిత సైబర్ భద్రత అవగాహన సదస్సు
### టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 18(సింగిడి):** కరీంనగర్: స్కిల్‌ఫోర్జ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20న కరీంనగర్ గణేష్‌నగర్‌లోని అదితి బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించనున్న సైబర్ భద్రత అవగాహన సదస్సు పోస్టర్‌ను టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తెలిపారు. "ఒక్క క్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి" అనే జాగ్రత్తను అలవాటు చేసుకోవాలని సూచించారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ మోసగాళ్లు మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, ఒకసారి ఉపయోగించే రహస్య సంకేతాలు (ఓటీపీలు), నకిలీ లింకులు, డిజిటల్ చెల్లింపుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు అవగాహనే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ, యువత, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఈ ఉచిత సదస్సుకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, సర్దార్, ఆర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, వాస్తవి, కోట రామస్వామి, శంకరయ్య, జీవన్, జీనియస్ అకాడమీ చైర్మన్ అనూప్ నారాయణ, నరసయ్యతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 19-6-2026

# రసాయనశాస్త్రంలో జి.సుప్రియకు పీహెచ్‌డీ



**పటాన్చెరు, జూన్ 18(సింగిడి) :** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జి. సుప్రియ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'పర్యావరణ, జీవ సంబంధ అనువర్తనాల కోసం హైబ్రిడ్ లోహ నానోకాంపోజిట్ల జీవసంశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ కె. ఫణి రాజా, సహ-పర్యవేక్షకుడు డాక్టర్ పి.వి.నాగేంద్ర కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కుమారి చేసిన డాక్టరల్ పరిశోధన, ముఖ్యమైన పర్యావరణ, బయోమెడికల్ అనువర్తనాలు కలిగిన అధునాతన మెటల్ నానోకాంపొజిట్ల గ్రీన్ సింథసిస్ పై దృష్టి సారించినట్లు వారు వివరించారు. ఈ అధ్యయనం మెరుగైన ఫోటోకాటలిక్, యాంటీ బాక్టీరియల్, ఎలక్ట్రోకెమి కల్, సెన్సింగ్ లక్షణాలను ప్రదర్శించినట్లు తెలిపారు. సుస్థిర సాంకేతిక పరిష్కారాల కోసం పర్యావరణ అనుకూల నానోపదార్థాల సామర్థ్యాన్ని ఇది నొక్కి చెబుతోందన్నారు. డాక్టర్ సుప్రియ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత..

నీలం మధు ముదిరాజ్..
తెల్లాపూర్ శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం





**పటాన్చెరు, జూన్ 18 (సింగిడి):** నూతన దేవాలయాల నిర్మాణం తో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని, ఆధ్యాత్మికత తో మానసిక ప్రశాంతత లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని జ్యోతిరావుపూలే కాలనీలో వెలసిన శ్రీ విజయదుర్గా పెద్దమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ గారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది.జూన్ 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేద పండితుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ... భక్తిభావం అనేది మనుషులలో మానసిక ప్రశాంతతను, సానుకూల శక్తిని నింపుతుందని పేర్కొన్నారు. గ్రామంలో ఇలాంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఆకాంక్షించారు. ఇంతటి అద్భుతమైన ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేసిన ఫౌండర్స్ కొల్లూరి అమృత సత్యయ్య దంపతులకు, భరత్, ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భగవంతుని కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ప్రార్థించారు ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్ పుష్పనాగేష్ యాదవ్, సీనియర్ నాయకులు పార్టీ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, డాకూర్ రామ్ మోహన్ రెడ్డి, లింగం, మధుసూదన్, రవి చారి, పాండు, బాబు గౌడ్, ఐలేష్ యాదవ్, ధరణి రాజు, రాజేష్, లక్ష్మణ్, కాంగ్రెస్ శ్రేణులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య అనే దీపం వెలిగితేనే... పేదరికం అనే చీకటి తొలగిపోతుంది

విద్యా దీపాలతో భవిష్యత్తుకు వెలుగు.




**జవహర్ నగర్, జూన్ 18 (సింగిడి):** విద్య అనే దీపం వెలిగితేనే... పేదరికం అనే చీకటి తొలగిపోతుందని టు బిహెచ్ కె జెఏసి అధ్యక్షుడు సందీప్ పేర్కొన్నారు. అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని నిరుపేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ డిగ్నిటీ హౌసింగ్ కాలనీస్ టు బిహెచ్కె జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ప్రవేశాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన ఐదుగురు విద్యార్థులకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ది సిటీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గౌతమీ హై స్కూల్‌లలో ఉచిత ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీత గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేశారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ టు బిహెచ్కె జేఏసీ అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి జంగిలి శివకుమార్, సభ్యుడు రాము తదితరులు మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే అవకాశం కల్పించిన భవిష్యత్తులో కూడా ఇలాంటి విద్యా సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, లబ్ధిదారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, జూన్ 18 (సింగిడి) :** హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్ లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పూర్ణ శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సర( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పై ముందుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశం అనంతరం కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా మంత్రులు, స్థానిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు శ్రీశైలం గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కటింగ్ చేయించి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, కవ్వంపల్లి సత్యనారాయణ గారు, మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, నియోజకవర్గ ఇన్చార్జ లు, ప్రణవ్, కేకే మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహదేవపురం శుభమస్తు బాంకెట్ హాల్‌లో బూత్‌స్థాయి అధికారులకు సర్‌పై శిక్షణ



**కుత్బుల్లాపూర్, జూన్ 18 (సింగిడి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్, గాజులరామారం సర్కిల్ పరిధిలో రాబోయే ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం సందర్భంగా, మహాదేవపురంలోని శుభమస్తు బ్యాంకెట్ హాల్‌లో బూత్ స్థాయి అధికారులకు (బి.ఎల్.ఓ) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను మాస్టర్ ట్రైనర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్‌ఓ యు. వెంకట్రాములు మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణలో ఏఈఆర్‌ఓ ఆర్. సుమిత్రతో పాటు బి.ఎల్.ఓ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొని సవరణ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అం శాలపై అవగాహన పొందారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మల్కారంలో ఘనంగా వన మహోత్సవం

మొక్కలు నాటిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ , జూన్ 18 (సింగిడి):** రాజేంద్రనగర్ నియోజకవర్గం, శంషాబాద్ మండలం పరిధిలోని మల్కారం గ్రామంలో 'వన మహోత్సవం' కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి. ప్రకాష్ గౌడ్ మొక్కలు నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించు కోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది మన అందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. గ్లోబల్ వార్మింగ్ విపత్తు నుంచి భూమిని కాపాడుకోవడానికి వృక్ష సంపద ఎంతో అవసరమన్నారు."భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మన కర్తవ్యం. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా కాపాడి వృక్షాలుగా మార్చాలి." అని అన్నారు.గ్రామాల్లో ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు నాటి మల్కారం గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఆయన గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్ సర్పంచ్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, మల్కారం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, మొక్కలు నాటారు.

# పుస్తకం చేతిలో ఉంటేనే.. భవిష్యత్తు వెలుగుమయం!



**ఆమనగల్లు, జూన్ 18(సింగిడి):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని,విద్యే ప్రతి చిన్నారి భవిష్యత్తుకు బలమైన పునాదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం నాయకులు బైండ్ల జంగయ్య,కట్ట శ్రీశైలం,యువకులు కొమ్ము శ్రీను,దుళ్ళ శంకర్,చిక్కొండ మల్లికార్జున్,జలగం మహేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డును పరిశీలించిన అధికారులు



**కీసర, జూన్ 18 (సింగిడి) :** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, రాంపల్లి చర్లపల్లి వెళ్లే మార్గంలోని డంపింగ్ యార్డులో రాత్రివేళల్లో చెత్తను కాల్చడం వల్ల కాలనీల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కౌకుంట్ల జీవన్ రెడ్డి, ఆల్ కాలనీ వేణుగోపాల్, ఆల్ కాలనీ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, రామ్ రెడ్డి, రామకృష్ణ కాలనీల వాసులు కలిసి డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా ఐఏఎస్ డంపింగ్ యార్డులోని చెత్తను తక్షణమే తొలగించాలని, వాహనాల రాకపోకలకు ఒకే మార్గాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# మానవుడి మనుగడకు మొక్కలే జీవం



**వికారాబాద్, జూన్18 (సింగిడి):** మానవుడి మనగడకు మొక్కలు శ్రీరామ రక్షని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణవాయివు అందించే మొక్కలను సంరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతనని అన్నారు. పార్యావరణ పరిరక్షణతోనే సకల జీవుల జీవితాలు ఆధారపడి ఉన్నాయని మొక్కల పెంపకం ఒక వ్యాపాకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పెట్లోళ్ళ నర్సింలు, సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రాజాక్, నాయకులు సర్దార్ఖాన్, ఎం ఏ అలీం, నయీమ్, ప్రభాకర్ గౌడ్, లింగదలీ రవికుమార్, కోర్వార్ నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు, మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో యుసిడి విభాగంపై జోనల్ కమిషనర్ సమీక్ష

లక్ష్యాలను వంద శాతం సాధించాలి: జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, జూన్ 18 (సింగిడి):** రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో గురువారం అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగంపై జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత, సంక్షేమ కార్యక్రమాల అమలుపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు: మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కొత్త ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ఏర్పాటును వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇందుకోసం నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతను అందించే బ్యాంక్ లింకేజీల ప్రక్రియను మరింత మెరుగుపరచాలని, అర్హులైన ప్రతి సంఘానికి సకాలంలో రుణాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ?ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మహిళలకు ఉపాధి కల్పిస్తూనే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేలా వీటి కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు."ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలి. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనిచేసి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ జోనల్ పరిధిలోని ఖజన ప్రాజెక్ట్ ఆఫీసర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దౌర్జన్యంగా పట్టాభూమి నుండి రోడ్డు

కిష్టాపూర్‌లో యజమాని ఈజీఎస్ కూలీల వాగ్వాదం
కోర్టు ద్వారా తేల్చుకుంటా.. యజమాని
దౌర్జన్యంతో కూలిలు, నివ్వరపోయిన పోలీసులు .
మరోసారి సర్వే చేయిస్తాం : తహసిల్దార్



**కొల్చారం, జూన్ 18 (సింగిడి) :** పట్టా భూముల నుంచి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు వేయడానికి ఎవరికీ వ్యక్తిగత హక్కు లేదని ప్రజాప్రయోజనం పేరుతో ప్రభుత్వం రోడ్డు వేయాలంటే చట్టబద్ధమైన పరిహారం లేదా ప్రత్యామ్నాయ భూమిని అందించాలని అక్రమంగా రోడ్డు వేస్తున్న ఉపాధి హామీ కూలీలను భూమి యజమాని శ్రీనివాస్ చౌదరి అడ్డుకున్న దౌర్జన్యంగా పక్కకు తోసేసి రోడ్డు వేయడ మెంటని ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ శివా రులోని ( సర్వే నెంబర్ 108, 112, 114, 106, 104 , 115) నంబర్ లలో గల మొత్తం 5 ఎకరాల నుండి 6 పిట్ల పానాది ఉందం టూ 2 వందల మంది గ్రామస్తులు ఉపాధి హామీ పథకం ద్వారా సర్పం చ్ నేతృత్వంలో 12 పిట్ల వెడల్పు తో మట్టి రోడ్డును వేస్తున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వే చేసే ముందు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా మా భూమి నుండి రోడ్డు వేస్తున్నా రని పసుల మల్లేశం , కర్రె దుర్గమని , సాదుల కిష్టయ్య , సాదుల సక్కుబాయ్ , తాళ్లగడ్డ యాదగిరి లు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది ధృవపత్రాలు వచ్చే వరకు ఒక్క రోజు ఆగండి అని మొరపెట్టుకున్న వినిపించుకోకుండా అక్రమంగా రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. విషయాన్నీ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా యజమాని శ్రీనివాస్ చౌదరి భూమిలో కాకుండా ఇతర పొలాల నుండి రోడ్డు వేసు కోవాలని ఆదేశించిన బేఖాతారు చేస్తూ రోడ్డు పనులను అలాగే మొద లుపెట్టారు. స్థానిక ఎస్సైకి యజమాని సమాచారం ఇవ్వగా ఇద్దరు కానిస్టేబుల్‌లను పంపించారు. వందల మందిని నిలువ రించ లేక మిన్నకుండిపోయారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడు తా నని యజమాని పేర్కొన్నారు. పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు వేయ డం ఏంటని ప్రశ్నించారు. వినిపించుకొనే పరిస్థితిలో ఎవరు లేకపోవ డంతో కోర్టు ద్వారానే తేల్చుకుంటానని చౌదరి పేర్కొన్నారు. చట్టపర మైన రక్షణ తెలంగాణ ల్యాండ్ ఎంక్రోచ్మెంట్ యాక్ట్ , 1905 ప్రకారం భూములను అక్రమంగా ఆక్రమించడం చట్టరీత్యా నేరం అని తెలిపారు.

# మల్లేమోనిగూడలో ముమ్మర కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

భారీగా వాహనాలు, మద్యం సీజ్





**వికారాబాద్, జూన్ 18(సింగిడి):** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పరిగి డివిజన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండి పరిగి మండలం మల్లేమోనిగూడ గ్రామంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ 'కమ్యూనిటీ కాంటాక్ట్' (కార్డన్ అండ్ సెర్చ్) ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 160 మంది అన్ని రకాల ర్యాంకుల పోలీస్ అధికారుల బలగంతో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. గ్రామంలోని ప్రతి ఇంటిని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా సోదా చేశారు. ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 1 కారుతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 39 లీటర్ల అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 31 చలాన్లు నమోదు చేసి, రూ. 12,245 జరిమానా విధించారు. అనుమానస్పదంగా ఉన్నటువంటి వ్యక్తులను పాప్ లాన్ డివైస్ ద్వారా తనిఖీ లు చెయ్యడం జరిగింది. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకే ఈ ముందస్తు తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, ఈ సందర్భంగా పోలీస్ అధికారులు గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో యువతను పట్టి పీడిస్తున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, మహిళల భద్రత, ఆస్తిపాస్తుల రక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన రహదారి భద్రత నియమాలపై ప్రజలకు, యువతకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమం లో పరిగి సీ ఐ కొండల్ రెడ్డి, కొడంగల్ సీ ఐ శ్రీధర్ రెడ్డి, పరిగి సబ్ డివిజన్ ఎస్.ఐ లు, సిబ్బంది, క్యూ ఆర్ టి సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# సూరారం చౌరస్తాలో నత్తనడకన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు.
వర్షాకాలం ప్రారంభమైనందున
సత్వరమే పనులు పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్





**కుత్బుల్లాపూర్, జూన్ 18 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం చౌరస్తాలో గత మూడు నెలల నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేస్తున్నారు. నత్తనూరు కనసాగుతున్న అభివృద్ధి పనులతో బాలానగర్, నరసాపూర్ రోడ్డులో 3నెలల నుండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూరారం చౌరస్తా నుండి మల్లారెడ్డి హాస్పిటల్ వైపు ప్రధాన రహదారిపై నత్త నడకన నడుస్తున్న అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్, ట్రాఫిక్ ఏసిపి, పోలీసు ఉన్నతాధికారులు, వచ్చి పనులు సాగుతున్న తీరును పరిశీలించి వెళ్లినా పని వేగం పుంజుకోలేదు అని సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై అభివృద్ధి పనులు జాప్యం వల్ల ఈ రహదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులు, ఉద్యోగాలకు, కళాశాలలకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బంది జరుగుతుంది. గత ఏడాది కూడా రోడ్డు అటు పక్కల ఇదేవిధంగా, వరద కాలువ నిర్మాణంతో ప్రజలు, వాహనదారులు,చాలా ఇబ్బంది పడ్డారు. నిరంతరం ట్రాఫి క్ పోలీసులు సమన్వయంతో పని చేసిన ఆ సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ ట్రాఫిక్ పోలీసులకు తలనొప్పిగా, భారంగా మారింది. ఇకనైనా ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ డ్రైనేజ్ పైప్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లే వారికి ఐదు నిమిషాలు పట్టే సమయం 20 నిమిషాలవుతుం ది. వాహనదారులు, స్థానిక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులకు సమయం వృధా కాకుండా చూడాలని, ప్రభుత్వ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, పని త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తమిళ ఆత్మగౌరవం - జాతీయ చిహ్నాల గౌరవం:

## సరికొత్త చర్చకు తెరలేపిన విజయ్ ప్రభుత్వం

## ద్రావిడ అస్తిత్వం ఎం జాతీయవాదం: వందేమాతరం తొలగింపు చుట్టూ తిరుగుతున్న తమిళ రాజకీయం

భారతదేశ రాజకీయ యవనికపై తమిళనాడుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇక్కడి రాజకీయాధికారం, సామాజిక గమనం ఎప్పుడూ భాషా స్వాభిమానం, ప్రాంతీయ అస్తిత్వం, సమాఖ్య వ్యవస్థల హక్కులు మరియు జాతీయత వంటి ప్రాథమికాంశాల చుట్టూనే భ్రమిస్తూ ఉంటాయి. సుదీర్ఘమైన సాంస్కృతిక చరిత్ర, బలమైన భాషా బంధం కలిగిన తమిళ సమాజంలో అస్తిత్వానికి సంబంధించిన ఏ చిన్న అంశమైనా సరే, అది జాతీయ స్థాయిలో పెద్ద చర్చకు దారితీయడం పరిపాటి. తాజాగా తమిళనాడు శాసనసభ సమావేశాల ప్రారంభ, ముగింపు గీతాల క్రమంపై తలెత్తిన వివాదం ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ విధానాలు, దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయాల మధ్య ఘర్షణగా మారిన ఈ ఉదంతం, భారత సమాఖ్య ఆకృతిలో ప్రాంతీయ అస్తిత్వానికి మరియు జాతీయ చిహ్నాలకు మధ్య ఉండాల్సిన సమతుల్యతపై సరికొత్త విశ్లేషణకు తావిచ్చింది.

ఈ వివాదానికి ప్రధాన కేంద్రం తమిళనాడు శాసనసభలో గీతాలను ఆలపించే క్రమం. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూటమి ప్రభుత్వం, అసెంబ్లీ సమావేశాలను సంప్రదాయ 'తమిళ్ తాయి వాళ్తు' (తమిళ్ తల్లి వందనం) గీతంతో ప్రారంభించి, చివరలో జాతీయ గీతమైన 'జనగణమన'తో ముగించాలని అధికారికంగా నిర్ణయించింది. అయితే, ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా గతంలో అసెంబ్లీ కార్యక్రమాల్లో అంతర్భాగంగా ఉన్న 'వందేమాతరం' గీతాన్ని పూర్తిగా తొలగించడం జాతీయవాద వర్గాల నుంచి తీవ్ర నిరసనలకు దారితీసింది. భారత స్వాతంత్ర్య సంగ్రామ చిహ్నమైన వందేమాతరాన్ని పక్కన పెట్టడం దేశభక్తిని నిరాదరించడమేనని విపక్షాలు ధ్వజమెత్తు తుండగా, ద్రావిడ భావజాల శక్తులు మరియు తమిళ సాంస్కృతిక సంస్థలు మాత్రం దీనిని తమిళనాడు యొక్క పురాతన సంప్రదాయాల పునరుద్ధరణగా, రాష్ట్ర ఆత్మగౌరవ ప్రకటనగా గట్టిగా సమర్థిస్తున్నాయి.

వాస్తవానికి ఈ వివాదం జూన్ 2026 నాటి అసెంబ్లీ సమావేశాల కంటే ముందే అంకురించింది. మే 10న ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన వేడుకలో ప్రదర్శించిన గీతాల క్రమం ఈ వివాదానికి మూలకారణమైంది. ఆ వేడుకలో మొదటగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమన, చిట్టచివరన తమిళ్ తాయి వాళ్తును ఆలపించారు. ఈ విధానం తమిళనాడులో దశాబ్దాలుగా స్థిరపడిన సాంస్కృతిక ప్రోటోకాల్‌కు పూర్తిగా భిన్నంగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర అధికారిక గీతాన్ని జాతీయ గీతాల తర్వాత, అదీ చివర్లో ఉంచడం తమిళ ఆత్మగౌరవాన్ని, భాషా సంస్కృతులను అవమానించడమేనని ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే), వామపక్ష పార్టీలు, మరియు వివిధ తమిళ జాతీయవాద సంస్థలు అప్పట్లోనే తీవ్ర ఆరోపణలు చేశాయి. ఈఅంశం వేగంగా రాజకీయ రంగు పులుము కోవడంతో, ప్రజాభిప్రాయాన్ని గమనించిన విజయ్ ప్రభుత్వం తక్షణమే అప్రమత్తమై, శాసనసభలో తమిళనాడు సంప్రదాయ విధానాన్నే పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఆ నిర్ణయ ఫలితమే ప్రస్తుత వందేమాతరం తొలగింపునకు దారితీసింది.

తమిళ సమాజంలో 'తమిళ్ తాయి వాళ్తు'కు ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకోకుండా ఈ వివాదాన్ని సంపూర్ణంగా విశ్లేషించలేము. ప్రముఖ పండితుడు



మనోన్మణీయం పె. సుందరనార్ రచించిన ఈ గీతం తమిళ భాషను, దాని ప్రాచీనతను ఒక దైవిక తల్లి రూపంలో కీర్తిస్తుంది. 1967లో తమిళనాడులో ద్రావిడ ఉద్యమం రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకున్నప్పటి నుండి భాషా ప్రాతిపదికన ఈ గీతం ప్రజాదరణ పొందింది. ఆ తదనంతర కాలంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, విద్యాసంస్థల వేడుకలు, ప్రభుత్వ సభలన్నీ తప్పనిసరిగా తమిళ్ తాయి వాళ్తుతో ప్రారంభించడం, ఆపై కార్యక్రమం ముగింపులో జాతీయ గీతం జనగణమనను ఆలపించడం ఒక విధిగా, ఆనవాయితీగా మారింది. 2021లో అప్పటి ప్రభుత్వం ఈ గీతానికి రాష్ట్ర అధికారిక గీత హోదాను కల్పిస్తూ, దీనిని ఆలపించేటప్పుడు అనుసరించాల్సిన స్పష్టమైన మార్గదర్శకాలను కూడా జీవో ద్వారా జారీ చేసింది. అందువల్ల, తమిళ ప్రజల మనోభావాలతో ఈ గీతానికి విడదీయరాని ముడిపడి ఉంది.

మరోవైపు, వందేమాతరం గీతానికి భారత దేశభక్తి చరిత్రలో అత్యున్నతమైన స్థానం ఉంది. 1882లో బంకిమ్ చంద్ర ఛటర్జీ తన ప్రసిద్ధ నవల "ఆనందమఠ్"లో భాగంగా సృష్టించిన ఈ గీతం, బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో లక్షలాది మంది స్వాతంత్ర్య సమర యోధులకు ప్రధాన ప్రేరణ శక్తిగా నిలిచింది. స్వదేశీ ఉద్యమం నుండి క్విట్ ఇండియా ఉద్యమం వరకు 'వందేమాతరం' అనే నినాదం భారత జాతీయ వాదానికి ప్రతీకగా మారింది. భారత రాజ్యాంగ పరిషత్ రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'జనగణమన'ను అధికారిక జాతీయ గీతంగా (చీఫ్అశీఖుశ్రీ ాాత్‌స్త్రవఎ) ఆమోదించినప్పటికీ, దేశ విముక్తి పోరాటంలో వందేమాతరం పోషించిన చారిత్రక పాత్రను గుర్తించి, దానికి జాతీయ గేయంగా (చీఫ్అశీఖుశ్రీ ాాశీఅర్త) సమాన గౌరవ హోదాను కల్పించింది. ఈ నేపథ్యంలోనే జాతీయవాద సంస్థలు వందేమాతరాన్ని అఖండ భారత ఐక్యతకు, దేశభక్తికి పరమ పవిత్ర ప్రతీకగా భావిస్తూ ఉంటాయి.

విజయ్ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతున్న రాజకీయ శక్తులు ప్రధానంగా జాతీయ చిహ్నాల నిరాదరణ అనే కోణాన్ని ముందుకు తెస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ), హిందూత్వ అనుబంధ సంస్థలు, మరియు కొన్ని జాతీయవాద వేదికలు తమిళనాడులోని నూతన ప్రభుత్వం కేవలం ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకే ఈ విధమైన చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర గీతానికి తగిన గౌరవం ఇవ్వడాన్ని ఎవరూ తప్పుబట్టడం లేదని, కానీ ఆ ప్రక్రియలో స్వాతంత్ర్య పోరాట వారసత్వానికి సంబంధించిన వందేమాతరాన్ని పూర్తిగా బహిష్కరించడం సరైన సంకేతం కాదని వారు వాదిస్తున్నారు. ప్రాంతీయత మరియు జాతీయతల మధ్య సమతుల్యతను పాటించకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దేశభక్తి గీతాలను పక్కన పెట్టడం జాతీయ సమగ్రతకు, ఐక్యతకు తీవ్ర భంగం కలిగిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ఈ విమర్శలను ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం మరియు దాని మద్దతుదారులు పూర్తిగా తోసిపుచ్చు తున్నారు. వారి వాదన ప్రకారం, శాసనసభ కార్యక్రమాల్లో ఎక్కడా జాతీయ చిహ్నాలకు అవమానం జరగలేదు. సర్వోన్నతమైన జాతీయ గీతం 'జనగణమన' యథావిధిగా సభా ముగింపులో గౌరవప్రదంగా ఆలపించ బడుతోంది. కేవలం తమిళనాడులో ఎప్పటి నుంచో అమల్లో ఉన్న సాంప్రదాయ పద్ధతి ప్రకారం 'తమిళ్ తాయి వాళ్తు'తో సభను ప్రారంభించి 'జనగణమన'తో ముగించే సంప్రదాయాన్ని మాత్రమే పునరుద్ధరిం చామని వారు స్పష్టం చేస్తున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనసభల లోపల వందేమాతరం గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలనే నియమం ఎక్కడా లేదని, కేవలం రాజకీయ కారణాలతోనే కొందరు ఈ వివాదాన్ని పెద్దది చేస్తున్నారని వారు ప్రతివాదన చేస్తున్నారు. తమిళ భాషా ప్రాధాన్యతను, రాష్ట్ర సంస్కృతిని కాపాడటమే తమ ప్రభుత్వ ఏకైక ఉద్దేశమని వారు ఉద్ఘాటిస్తున్నారు.

ఈ మొత్తం వ్యవహారాన్ని నిష్పాక్షికంగా విశ్లేషించాలంటే తమిళనాడు సుదీర్ఘ రాజకీయ, సామాజిక చరిత్రను అవలోకనం చేసుకోవాల్సి ఉంటుంది. 1960ల కాలంలో సాగిన హిందీ వ్యతిరేక ఉద్యమాలు తమిళ సమాజంలో భాషా ప్రాతిపదికన తీవ్రమైన చైతన్యాన్ని రగిల్చాయి. 1967లో కాంగ్రెస్ పార్టీని ఓడించి ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అధికారంలోకి వచ్చిన నాటి నుండి, రాష్ట్ర హక్కుల పరిరక్షణ, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో సమాఖ్య స్ఫూర్తి, మరియు భాషా స్వాభిమానం అనేవి తమిళ రాజకీయ సంస్కృతికి మూలస్తంభాలుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం విధించే ఏకశిలా సంస్కృతిని నిరసిస్తూ తమ ప్రత్యేక అస్తిత్వాన్ని చాటుకోవడం ఇక్కడి రాజకీయాలలో నిరంతరం కనిపించే ప్రక్రియ. అందువల్లనే, జాతీయ చిహ్నాలకు లేదా గీతాలకు సంబంధించిన ఏ చిన్న మార్పు అయినా ఇక్కడ త్వరగా భాషా స్వాభిమాన చర్చగా రూపాంతరం చెందుతుంది.

ఈ వివాదానికి ప్రస్తుత రాజకీయ పరిణామాలు కూడా ఒక ముఖ్య కారణం. మొత్తం 234 స్థానాలు కలిగిన తమిళనాడు శాసనసభకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక పెద్ద మైలురాయిగా నిలిచాయి. గత ఆరు దశాబ్దాలుగా కేవలం డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల మధ్యే తిరుగుతూ వచ్చిన అధికారం, తొలిసారిగా సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూటమి వశమైంది. ఒక సరికొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చిన విజయ్ ప్రభుత్వంపై మొదటి నుండి ద్రావిడ భావజాల శక్తులు, సాంప్రదాయ తమిళ జాతీయవా దులు ఒక విధమైన సందేహాన్ని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, తన ప్రభుత్వంపై ఉన్న 'రాజకీయ అనుమానాలను' పటాపంచలు చేయడానికి మరియు తాము కూడా తమిళ సాంస్కృతిక అస్తిత్వానికి, ద్రావిడ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని నిరూపించుకోవడానికి విజయ్ ఈ నిర్ణయాన్ని ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ క్రమంలో వివిధ రాజకీయ పక్షాల ద్వంద్వ వైఖరి కూడా స్పష్టంగా బయట పడింది. నిన్నటివరకు అధికారంలో ఉండి ఒక రకమైన ప్రోటోకాల్‌ను సమర్థించిన పార్టీలు, నేడు ప్రతిపక్షంలోకి రాగానే భిన్నమైన గొంతు వినిపించడం గమనార్హం. సోషల్ మీడియా వేదికలైన ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్, వంటి మాధ్యమాలలో కూడా ఈ గీతాల క్రమంపై నెటిజన్లు రెండు వర్గాలుగా చీలిపోయి సుదీర్ఘ చర్చలు జరుపు తున్నారు. తమిళనాడు యువతలో ఎక్కువ శాతం మంది దీనిని తమిళ సంస్కృతిని కాపాడే చర్యగా కొనియాడుతుండగా, జాతీయ దృక్పథం కలిగిన విద్యావంతులు మాత్రం అనవసరమైన రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయ గేయాలను వివాదాల్లోకి లాగడం శ్రేయస్కరం కాదని అభిప్రాయ పడుతున్నారు.

తమిళనాడు శాసనసభలో తలెత్తిన వందేమాతరం వివాదం కేవలం రెండు గీతాల మధ్య లేదా కొన్ని పదాల అమరిక మధ్య ఉన్న తేడా మాత్రమే కాదు. ఇది భారత రాజ్యాంగం ప్రసాదించిన 'రాష్ట్రాల యూనియన్' అనే సమాఖ్య వ్యవస్థలో ప్రాంతీయ గుర్తింపులకు మరియు అఖండ జాతీయ ఐక్యతకు మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే ప్రాథమిక ప్రశ్నకు నిదర్శనం. వైవిధ్యంలో ఏకత్వాన్ని చాటే భారతదేశం వంటి బహుళ సంస్కృతుల దేశంలో ప్రాంతీయ భాషలకు, ఆయా రాష్ట్రాల ఆత్మగౌరవానికి తగిన ప్రాధాన్యత ఇస్తూనే, జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం. తమిళనాడులో విజయ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తాత్కాలికంగా రాజకీయ దుమారాన్ని లేపినప్పటికీ, ప్రజాస్వామ్య బద్ధంగా సాగుతున్న ఇటువంటి మేధోపరమైన చర్చలు భవిష్యత్తులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలను మరియు భారత సమాఖ్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడానికి దోహద పడతాయని ఆశించవచ్చు.

# మండి పోతున్న కూరగాయల ధరలు

**ఎండలు దంచి కొడుతూ వున్నాయి.జూన్ నెల దగ్గర పడుతున్నా ఎండలు తగ్గు ముఖం పట్టలేదు వడగాలులు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.కూరగాయల ధరలు సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రోజురోజుకు ఆకాశన్నంటుతున్న ధరలతో బెంబేలెత్తుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితికి చేరుతున్నాయి. చిన్న చిన్న పనులు చేసుకునే బతికేవారికి రోజూ పనిదొరకడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో పెరిగిన కూరగాయల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.**

ఈ సారి ఎండ వేడికి కూరగాయల ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఉత్పత్తి తగ్గి డిమాండ్ పెరగడంతో ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. ఇప్పటికే నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన కూరగాయల ధరలు భారంగా మారాయి. నెలరోజుల క్రితం వరకు అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు మూడింతలకు పైగా పెరిగిపోయాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు పప్పుదినుసులతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. రాజధాని తో పాటు అన్ని జిల్లాలలో నుంచి రైతులు కూరగాయలు బగ్గు మంటూ వున్నాయి. కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతులు తగ్గిపోయాయి. కూరగాయల ధరలు పెరగడంతో కొనుగోళ్లు కూడా పడిపోయాయి. ధరల పెరుగుదలతో అదనపు భారం కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్యు ల కుటుంబాలకు ఆదనపు భారం పడింది. ఒక కుటుంబానికి ఆదనంగా వెయ్యి రూపాయల పైనే భారం పడుతోంది. నెల రోజుల క్రితం వరకు టమాటా కిలో రూ.10,రూ.15 వరకు ఉండగా ప్రస్తుతం రూ50 వరకు పలుకుతోంది. పచ్చిమిర్చి కిలో రూ.60 నుంచి రూ .100, బెండకాయలు కిలో రూ.80వరకు పెరిగాయి. కాకర రూ.40 నుంచి రూ80, వంకాయలు రూ.80పాలకూర రూ.70కి చేరుకుంది. క్యాబేజీ కిలో రూ.80క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.50, మునక్కాయలు రూ .100, కోతిమీర రూ.100, అలుగడ్డలు రూ.50 చిక్కుడు రూ. 60, చుక్క కూర రూ.30, ఉల్లిగడ్డలు రూ.25కు చేరుకున్నాయి. ఇలాగే ఇతర కూరగాయల ధరలు రెండింతల నుంచి మూడింతలు పెరగడంతో ఇబ్బందులుపడుతున్నారు.వ్యాపారులకు ఇబ్బంది కూరగాయల ధరలు పెరగడంతో అన్ని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు తగ్గిపోయి చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి అమ్ముకునే వ్యాపారులు ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోలు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో కూరగాయల అమ్మకాలను కూడా తగ్గించుకోవాల్సి వస్తోందని అంటూ వున్నారు. పెరిగిన ధరలు తగ్గించాలని మనవి.

**కామిడి సతీశ్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి**
**9848445134**





# తిట్టే నాలుకలే ఎక్కువ... గుర్తించే కళ్లెక్కడ!?

సమాజంలో కొన్ని పదాలు కాలక్రమేణా వాటి అసలు అర్థాన్ని కోల్పోయి అవహేళనకు ప్రతీకలుగా మారిపోతాయి. అలాంటి పదాల్లో "గాడిద" ఒకటి. తెలివితక్కువతనం, అసమర్థత లేదా అవగాహనలేమిని సూచించడానికి ఈ పదాన్ని తరచూ వాడుతుంటారు. అయితే చరిత్రను, శాస్త్రాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిశీలిస్తే గాడిద పూర్తిగా భిన్నమైన చిత్రాన్ని మన ముందుంచుతుంది. వేల సంవత్సరాలుగా మానవ నాగరికతకు సేవలందించిన మూగజీవి కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, చిన్న తరహా రవాణా వ్యవస్థల్లో కీలక పాత్ర పోషించింది. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ అంచనాల ప్రకారం ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది గాడిదలు గ్రామీణ జీవనానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తోడ్పడుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గాడిదలు కనిపించడం స్థానికులను ఆకర్షించడమే కాకుండా, కనుమరుగవుతున్న ఒక శ్రమజీవి జాతిని మళ్లీ గుర్తు చేసింది.

**అసలు మొండితనం ఎవరిది?**

భారత ప్రభుత్వ 20వ పశుగణన (2019) గణాంకాలు ఒక ఆందోళనకర వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి. దేశంలో గాడిదల జనాభా గత దశాబ్దాల్లో గణనీయంగా తగ్గిపోయి సుమారు 1.2 లక్షలకు పరిమితమైంది. 2012తో పోలిస్తే ఇది 61 శాతం కంటే ఎక్కువ తగ్గుదలగా నమోదైంది. యాంత్రీకరణ, సాంప్రదాయ వృత్తుల క్షీణత, గ్రామీణ జీవనశైలిలో వచ్చిన మార్పులు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు "గాడిదలా పని చేస్తున్నాడు" అని చెప్పిన సమాజం, నేడు నిజంగానే పని చేసే గాడిదలను వెతికే పరిస్థితికి చేరుకోవడం కాలం చేసిన వ్యంగ్యంగా కనిపిస్తుంది. జీవ వైవిధ్యం తగ్గిపోవడం కేవలం ఒక జాతి సమస్య మాత్రమే కాదు, అది పర్యావరణ సమతుల్యతకు, గ్రామీణ జీవన వ్యవస్థలకు కూడా హెచ్చరిక గంటగా భావించాల్సిన అంశం.

**ప్రమాదాన్ని ముందే చదివే మేధస్సు!**

గాడిదల గురించి ఉన్న అనేక అపోహలను శాస్త్రీయ అధ్యయనాలు ఖండిస్తున్నాయి. జంతు ప్రవర్తనా శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం గాడిదలు మంచి జ్ఞాపకశక్తి కలిగిన జీవులు. ప్రమాద పరిస్థితుల్లో అవి భయంతో గుడ్డిగా స్పందించకుండా ముందుగా పరిస్థితిని అంచనా వేస్తాయి. చాలామంది దీనిని "మొండితనం"గా అభివర్ణించినప్పటికీ, పరిశోధకులు దానిని జాగ్రత్త స్వభావానికి సంకేతంగా చెబుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కొన్నిసార్లు ఆలోచించి అడుగు వేసే జీవిని మొండిదని పిలుస్తూ, ఆవేశపూరిత నిర్ణయాలను తెలివిగా భావించే విరుద్ధ ధోరణి సమాజంలో కనిపిస్తుంది. ఈ విరుద్ధ దృక్పథమే గాడిదపై సమాజం ఏర్పరచుకున్న అపోహలకు మూలం.

**నేడు గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్!**

ప్రపంచంలోని కొన్ని దేశాలు నేడు గాడిదల విలువను కొత్త కోణంలో గుర్తిస్తున్నాయి. "డాంకీ అసిస్టెడ్ థెరపీ" పేరిట మానసిక ఒత్తిడి, అభివృద్ధి సంబంధిత సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లల పునరావాస కార్యక్రమాల్లో వీటి ప్రశాంత స్వభావాన్ని వినియోగిస్తున్నారు. మరోవైపు గాడిద పాలకు సంబంధించిన ప్రత్యేక మార్కెట్ కూడా కొన్ని దేశాల్లో అభివృద్ధి చెందుతోంది. అయితే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రచారాల విషయంలో శాస్త్రీయ ప్రమాణాలు, నియంత్రణ వ్యవస్థలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన జీవి నేడు ఆర్థిక, సామాజిక, వైద్య చర్చల్లో స్థానం సంపాదించుకోవడం విశేషం. ప్రపంచం గౌరవం నేర్చుకుంటుంటే, మనం ఇంకా అవహేళన భాషలోనే చిక్కుకుపోవడం ఆలోచించాల్సిన విషయం.

**నిశ్శబ్ద సేవకు సలాం..**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఊ(స్త్ర) ప్రతి పౌరుడు జీవరాశుల పట్ల కరుణాభావంతో వ్యవహరించడం ప్రాథమిక కర్తవ్యంగా పేర్కొంటోంది. జంతు సంక్షేమ చట్టాలు కూడా మూగజీవుల సంరక్షణను ప్రోత్సహిస్తున్నాయి. చట్టాలు పుస్తకాలకే పరిమితం కాకుండా భూమిపై అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, పశుసంవర్ధక శాఖలపై ఉంది. అంతరించిపోతున్న పశుసంపద జాతులపై ప్రత్యేక అధ్యయనాలు, పశు వైద్య సేవల విస్తరణ, యజమానులకు అవగాహన కార్యక్రమాలు, అక్రమ రవాణాపై కట్టడి వంటి చర్యలు అవసరం. సమాజం తరచూ హేళన చేసే ఈ మూగజీవి మాత్రం ప్రతిఫలం ఆశించకుండా తన బాధ్యతను నిర్వర్తిస్తూనే ఉంటుంది. అందుకే గాడిదను అవమానానికి ప్రతీకగా కాకుండా, శ్రమకు, ఓర్పుకు, నిబద్ధతకు, నిశ్శబ్ద సేవకు ప్రతీకగా చూడగలిగితేనే మన దృక్పథంలో నిజమైన మార్పు వచ్చినట్టవుతుంది. కొన్నిసార్లు మనుషుల గోల కంటే మూగజీవి నిశ్శబ్దమే ఎక్కువ విజ్ఞానాన్ని నేర్పుతుంది.



**ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

# ఆహార భద్రత విషయంలో రాజీ లేదు

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ప్రతి వారం హోటళ్లు, బేకరీల తనిఖీకి చెయ్యాలి**

**నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు**



**నాగర్ కర్నూల్ జూన్ 18 (సింగిడి) :** ఫుడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్క ర్నూల్ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహార పదార్థాలు అందేలా ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఫుడ్ సేఫ్టీ అధికారిని శ్రీలతను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ సమీక్ష సమావే శానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షత వహించి జిల్లాలో ఆహార భద్రత పరిస్థితులు, తనిఖీల పురోగతి, ఆహార నమూనాల సేకరణ, నిబంధనల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యమైన అంశమని, ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్స్ తయారీ కేంద్రాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కూల్‌డ్రింక్స్ విక్రయ కేంద్రాలు, ఇతర ఆహార వ్యాపార సంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. ప్రతి వారం హోటళ్లు, బేకరీలను తనిఖీ చేసి ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతకు ఆదేశాలు జారీ చేశారు. నమూనాల పరీక్షల్లో నాణ్యత లోపాలు, కల్తీ లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లయితే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ సూచించారు. ఆహార భద్రతా ప్రమాణాలను పాటించకుండా పరిశుభ్రత లేని వాతావరణంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న హోటళ్లు, బేకరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వంటశాలలు, ఆహార నిల్వ గదులు, తాగునీటి సదుపాయాలు, ఆహార పదార్థాల నిల్వ విధానాలు, సిబ్బంది వ్యక్తి గత పరిశుభ్రత వంటి అంశాలను తనిఖీల్లో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, నాసిరకం నూనెలు, రంగులు లేదా ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ఆహార వ్యాపార సంస్థలు తప్పని సరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) నిబంధనలను పాటించాలని, చెల్లుబాటు అయ్యే లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు కలిగి ఉండాలని తెలిపారు. లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినియోగ దారులలో కూడా ఆహార భద్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని ప్రజలకు సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులే కుండా ప్రతి వారం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించా లని, ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు, ప్రజల కు ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఆహార వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిని దమయంతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్గొన్నారు.

# ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల

బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చేతన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవు తున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్



అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యా ప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

థియేటర్లలో పెద్ది..

# రీలోడెడ్ వర్షన్

## మరో ఆరు నిముషాల అదనపు దృశ్యాలు జోడింపు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు సరికొత్త 'రీలోడెడ్ వెర్షన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు దృశ్యాలను జోడించి



నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త ఫుటేజ్‌లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఎమోషనల్ సీన్స్‌తో పాటు, సీనియర్ నటుడు జగపతి బాబు నటించిన కీలకమైన సన్నివేశం కూడా ఉండటం విశేషం. ఈ అదనపు ఐదున్నర నిమిషాల సీన్స్ సినిమా ఎమోషన్‌ను, డ్రామాను మరో స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బూస్ట్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇప్పటికే మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న 'పెద్ది'.. కొత్త సీన్ల జోడింపుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు బద్దలు కొడుతుందా అనేది ఆసక్తిగా మారింది. థియేటర్లలో 'పెద్ది' రీలోడెడ్ వెర్షన్‌ను మిస్ అవ్వొద్దని చిత్రయూనిట్ మెగా ఫ్యాన్స్‌కు పిలుపునిచ్చింది.

# కోలీవుడ్‌లో దీపావళి ఫైట్

## రజనీకాంత్ జైలర్-2తో ధనుష్ మూవీ పోటీ

కోలీవుడ్‌లో ఈ ఏడాది దీపావళి పండుగకు బాక్సాఫీస్ దగ్గర మరోసారి భారీ వార్‌కు రంగం సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పటికే 90శాతం షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఇక ఈ సినిమాకు



సంబంధించిన డిజిటల్, శాటిలైట్ రైట్స్ కోసం దిగ్గజ ఓటీటీ సంస్థల మధ్య పోటీ నెలకొంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో సందడి చేయనున్నాడు. వచ్చేవారం నుంచి హృతిక్ పార్ట్ షూటిం గ్‌ను ప్లాన్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'జైలర్2'ను దీపావళి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయా లని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రక టన త్వరలోనే రానుంది. ఇదిలా ఉంటే నటుడు ధనుష్ కూడా అదే దీపావళి రేసులోకి దిగేందుకు సిద్ధమవ్రుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.

ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, స్టార్‌హీరోయిన్లు సాయిపల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈచిత్రాన్ని కూడా దీపావళికే రిలీజ్ చేసే యోచ^నలో నిర్మాతలు ఉన్నారు. ఒకవైపు రజనీకాంత్ క్రేజ్, మరోవైపు ధనుష్ కంటెంట్.. మరి ఈ క్లాష్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

అనిల్ రావిపూడి మరో మల్టీస్టారర్ ప్రాజెక్ట్

# వెంకటేశ్, కళ్యాణ్‌రామ్ మూవీకి శ్రీకారం



టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి తెరలేచింది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి.

ఈ వేడుకకు దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తదితరులు విచ్చేసి క్లాప్ కొట్టారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయికలకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌లో వెంకీ మామకు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటిస్తోండగా.. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి సందడి చేయనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసివచ్చిన సంక్రాంతి సీజన్‌నే ఈ సినిమాకు కూడా లాక్ చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దగ్గుబాటి మరియు నందమూరి వంశాల హీరోలు కలిసి నటిస్తుం డటంతో, అనిల్ రావి పూడి మార్క్ కామెడీ అండ్ యాక్షన్



ఎంటర్‌టైన్ మెంట్‌పై అటు అభిమానుల్లో, ఇటు సాధారణ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.



# పంద్రాగస్ట్‌కు బట్వారా 1947 విడుదల

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.








Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037. and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737